ఎడిటర్ : డా.దామా విజయ్‌కుమార్
మా కలం - సామాన్యుడి బలం
CELL : 9440352036
# స్వర్ణసాగరం
WWW.SWARNASAGARAM.COM
PRGI : APTEL/26/A1104
జాతీయ తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను
9440352036
ఆంధ్రప్రదేశ్ తెలంగాణ
సంపుటి : 1, సంచిక : 157
పేజీలు : 8
మంగళవారం 18 ఆగస్టు 2026
వెల : 2-00



## త్వరలోనే ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీలో భారత్ స్వయం సమృద్ధి

- అశ్విని వైష్ణవ్ కీలక వ్యాఖ్యలు
- కీలక ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్లలో స్వయం సమృద్ధి సాధిస్తున్న భారత్
- ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డ్స్ చైనాకు ఎగుమతి చేస్తున్న భారత పరిశ్రమలు
- ఎన్‌క్లోజర్లు, ఆప్టికల్ ట్రాన్స్‌సీవర్స్, ఆనోడ్ మెటీరియల్స్‌లోనూ ఆత్మనిర్భరత

2



## అణు ప్రమాదంలో న్యాయమైన పరిహారం ఇవ్వకుండా ఆ చట్టం కోర్టులను నిరోధిస్తుందా?

- ఈ చట్టం కింద ఏర్పాటు చేసే నియంత్రణ మండలిలో సభ్యులను నియమించే ప్రక్రియలో ఎలాంటి ప్రయోజనాల సంఘర్షణ లేదనే విషయాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేయాలని ఆదేశం

# ధైర్యం ఉంటే అసెంబ్లీకి రండి

- వైసీపీకి సీఎం చంద్రబాబు సవాల్
- డీఎస్సీ నియామకాల్లో ఎక్కడా డీవియేషన్ లేదు
- నియామక ప్రక్రియ వివరాలన్నీ ఆన్‌లైన్‌లోనే..
- వైసీపీది హిట్ అండ్ రన్ చర్యలు
- మా ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీ.. కుట్రదారులకు కాదు
- శాసనసభలో మెగా డీఎస్సీపై చర్చలో చంద్రబాబు ప్రసంగం

అమరావతి, స్వర్ణసాగరం

మెగా డీఎస్సీ నియామకాల్లో ఎక్కడా డీవియేషన్ లేదని, నియామక ప్రక్రియకు సంబంధించిన వివరాలన్నీ పారదర్శకంగా ఆన్‌లైన్‌లోనే ఉంచామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. డీఎస్సీ నియామకాలపై వైసీపీ నేతలు హిట్ అండ్ రన్ చర్యలతో దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన ఆక్షేపించారు. సోమవారం శాసనసభలో మెగా డీఎస్సీ నియామకాలపై జరిగిన చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. మంచి విద్య, నైపుణ్యాలు అందిస్తే అత్యుత్తమ మానవ వనరులుగా విద్యార్థులు తయారవుతారని తాము విశ్వసించామని, దానికి అనుగుణంగానే చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఐటీని ప్రోత్సహించడం ద్వారా టెక్నాలజీలో ప్రపంచంలోనే అత్యుత్తమ మానవ వనరులను తయారు చేశామని, విద్యారంగాన్ని తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ ప్రోత్సహించిందన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలల ద్వారా నాడు ఎన్టీఆర్ విద్యారంగంలో సంస్కరణలు తీసుకొచ్చారని, మహిళలకు ఉన్నత - మిగతా 2లో



## ఎల్‌నినోపై పోరాటానికి పంచ సూత్రాలు

- తాగునీటికే ప్రథమ ప్రాధాన్యం : సీఎం చంద్రబాబు
- ఎల్‌నినోపై ప్రజలకు అవగాహన కల్పించాలి
- ముందుజాగ్రత్తలు తీసుకోవడం వల్లే ఇప్పుడు తాగునీరు ఇవ్వగలుగుతున్నాం
- జలధార కార్యక్రమాన్ని ప్రధాని మోదీ కూడా ప్రశంసించారన్న చంద్రబాబు

2



## హాస్టల్‌లో పసికందు.. పర్యవేక్షణ ఏదీ?

- సెప్టిక్ ట్యాంకులపై శిశువు.. సిబ్బంది తీరుపై సందేహాలు
- స్థానికులు గుర్తించే వరకు తెలియదా?
- సమాచారమిచ్చిన తీరుపైనా ప్రశ్నలు
- సీసీ కెమెరాలు, డ్యూటీ రిజిస్టర్ పరిశీలిస్తే అసలు విషయం!

2లో

## అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట

- రాష్ట్రంలో మారిన యూడీఏల ముఖచిత్రం.. కొత్తగా 3 పట్టణాభివృద్ధి సంస్థలు ఏర్పాటు
- ఏపీలో జిల్లాల పునర్వ్యవస్థీకరణకు అనుగుణంగా యూడీఏల పరిధుల ప్రక్షాళన
- పరిపాలనా సౌలభ్యం కోసం నంద్యాల, మార్కాపురం, భీమవరం కేంద్రాలుగా మూడు కొత్త పట్టణాభివృద్ధి సంస్థల ఏర్పాటు
- ఉత్తర్వులు జారీ చేసిన పురపాలకశాఖ

3

# ఇదేనా పాలన?



- పోలీసు వాహనాల్లోనే గంజాయి
- వైయస్ జగన్ మోహన్ రెడ్డి ట్వీట్
- పోలీసుల వాహనంలో గంజాయి, మద్యం దొరకటంపై వైఎస్ జగన్ దిగ్భ్రాంతి
- ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసు వ్యవస్థలోనే, అక్రమాలను అడ్డుకోవాల్సిన యంత్రాంగంతోనే అక్రమాలు చేయిస్తుంటే, వాటిలోనే అవినీతి చోటుచేసుకుంటే ప్రజలు ఎవరిని నమ్మాలి?
- ఆ పార్టీలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారన్న సమాచారం మరింత దిగ్భ్రాంతి కలిగిస్తోంది
- ఘటనా స్థలం నుంచి కారులో ఉన్న ఆ ఇద్దరు పోలీసు అధికారులను స్థానిక టీడీపీ నాయకులు తప్పించారన్న ఆరోపణలు కూడా అత్యంత తీవ్రమైనవి.

అమరావతి, స్వర్ణసాగరం

పోలీసుల వాహనంలో గంజాయి, మద్యం దొరకటంపై వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రభుత్వం, పాలన ఏ స్థాయిలో కుప్పకూలిందో ఈ ఘటనే నిదర్శనం అంటూ ఫైరయ్యారు. చంద్రబాబూ... అసలు రాష్ట్రాన్ని ఎక్కడికి తీసుకెళ్తున్నారంటూ ప్రశ్నించిన జగన్.. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసు వ్యవస్థలోనే, అక్రమాలను అడ్డుకోవాల్సిన యంత్రాంగంతోనే అక్రమాలు చేయిస్తుంటే, వాటిలోనే అవినీతి చోటుచేసుకుంటే ప్రజలు ఎవరిని నమ్మాలి?. ఎవరికి ఫిర్యాదు చేయాలి?' అని ప్రశ్నించారు. ఈ మేరకు వైఎస్ జగన్ సోమవారం (ఆగస్టు 17) ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. 'హే రామ్...! గంజాయి, మద్యం అక్రమ రవాణాను అరికట్టాల్సిన పోలీసుల వాహనంలోనే గంజాయి, మద్యం బాటిళ్లు కనిపిస్తే... రాష్ట్రంలో పరిస్థితులు ఎంత దారుణంగా - మిగతా 3లో



## పంద్రాగస్టు వేళ భారీ ఐఎస్ఐ నెట్‌వర్క్‌ను తుడిచిపెట్టాం

- 200 మందికి పైగా ఆపరేటివ్‌లను అరెస్ట్ చేశాం
- అమిత్ షా కీలక ప్రకటన
- దేశంలో ఉగ్రవాద కార్యకలాపాలపై అమిత్ షా కీలక వ్యాఖ్యలు
- ఐఎస్ఐ మద్దతు గల షహజాద్ భట్టి నెట్‌వర్క్‌ను నాశనం చేసినట్లు ప్రకటన
- తద్వారా విధ్వంసర దాడుల ప్రణాళికలను భగ్నం చేసినట్లు వెల్లడి

2

## సభలోనైనా, బయటైనా.. డిబేట్‌కు నేను రెడీ

- డీఎస్సీ 2025పై ఎక్కడైనా చర్చకు సిద్ధమని లోకేశ్ సవాల్
- ముఖ్యమంత్రి తొలి సంతకాన్ని అడ్డుకోవాలన్నదే వైసీపీ కుట్ర అని ఆరోపణ
- 148 రోజుల్లో 16,347 పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తి చేశామని వెల్లడి
- డీఎస్సీపై వైసీపీ చేసిన ఆరోపణలన్నీ అవాస్తవమని తిప్పికొట్టిన మంత్రి
- ప్రతి ఏటా డీఎస్సీ నిర్వహిస్తామని, విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తామని హామీ



అమరావతి, స్వర్ణసాగరం

"గొడ్డలి పార్టీ అధ్యక్షుడికి సవాల్ విసురుతున్నా. డీఎస్సీ–2025పై చర్చకు నేను సిద్ధం. సభ లోపలైనా, బయటైనా సరే.. టైమ్, డేట్ మీరే ఫిక్స్ చేయండి" అంటూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, వైసీపీ అధినేత జగన్ కు బహిరంగ సవాల్ విసిరారు. మెగా డీఎస్సీపై వైసీపీ చేస్తున్న ఆరోపణలపై శాసనసభలో సుదీర్ఘ ప్రకటన చేసిన ఆయన, ప్రతిపక్షంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తాను బెయిల్‌పై లేనని, తనపై సీబీఐ, ఈడీ కేసులు లేవని, విదేశాలకు వెళ్లేందుకు తనకేమీ కోర్టు అనుమతులు అవసరంలేదని ఎద్దేవా చేశారు. చర్చకు వస్తే వాస్తవాలు - మిగతా 3లో



## 2014 నుంచి నిర్వహించిన పరీక్షలన్నీ రద్దు

- ఝార్ఖండ్ సర్కార్ సంచలన నిర్ణయం
- 2014 నుంచి జరిగిన అన్ని పరీక్షలపై సమగ్ర విచారణకు ఆదేశం
- అన్ని పరీక్షలు, ప్రకటించిన ఫలితాలు, ఎంపిక చేసిన అభ్యర్థుల లిస్టు సహా ఆ సంస్థకు సంబంధించిన ప్రతిదానినీ రద్దు
- కేంద్ర ప్రభుత్వం ఎంఎండీఆర్ చట్టానికి చేసిన సవరణలపై చర్చించడానికి త్వరలో సమావేశమవుతాం.

2లో

PRGI : APTEL/26/A1104 జాతీయ తెలుగు దినపత్రిక
WWW.SWARNASAGARAM.COM

# బాలికల హాస్టల్ ప్రాంగణంలో పసికందు..?





- సెప్టిక్ ట్యాంకుపై శిశువు.. సిబ్బంది తీరుపై సందేహాలు
- స్థానికులు గుర్తించే వరకు తెలియదా? సమాచారమిచ్చిన తీరుపైనా ప్రశ్నలు
- సీసీ కెమెరాలు, డ్యూటీ రిజిస్టర్ పరిశీలిస్తే అసలు విషయం!
- శ్రీకాళహస్తి బాలికల వసతి గృహం ప్రాంగణ పరిసర ప్రాంతంలో ఘటన

శ్రీకాళహస్తి, స్వర్ణసాగరం

**బాలికల వసతి గృహం.. విద్యార్థినుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన ప్రదేశం. ఎవరెప్పుడు వస్తున్నారు? ఎవరు వెళ్తున్నారు? రాత్రివేళ ప్రాంగణం లోకి అనుమతి లేని వ్యక్తులు ప్రవేశిస్తున్నారా? అనే అంశాలపై నిరంతరం నిఘా ఉండాలి. కానీ శ్రీకాళ హస్తి పట్టణంలోని ఇంటర్ బాలికల హాస్టల్ ప్రాంగ ణంలో తాజాగా అప్పుడే పుట్టిన పసికందు కనిపిం చడం పర్యవేక్షణ వ్యవస్థపై తీవ్ర ప్రశ్నలు రేకెత్తిస్తోంది. హాస్టల్ వెనుక భాగంలోని సెప్టిక్ ట్యాంకుల వద్ద శిశు వు ఏడుపు వినిపించడంతో స్థానికులు గుర్తించి హాస్టల్ వార్డెన్‌కు సమాచారం ఇచ్చినట్లు ప్రచురితమైన కథ నాలు పేర్కొంటున్నాయి. వార్డెన్ పోలీసులకు తెలియ జేయడంతో శ్రీకాళహస్తి టూటౌన్ పోలీసులు అక్కడికి చేరుకుని శిశువును ఆసుపత్రికి తరలించారు. అయితే ..అసలు ప్రశ్న ఇక్కడి నుంచే మొదలవుతోంది.**

### ప్రాంగణంలోకి ఎలా వచ్చింది?

ప్రహరీ.. గేట్లు.. హాస్టల్ సిబ్బంది.. రాత్రి పర్యవేక్షణ.. భద్రతా ఏర్పాట్లు.. ఇవన్నీ ఉన్న చోటికి పసికందును ఎవరో తీసుకొచ్చి వదిలి వెళ్లే వరకు సిబ్బందికి తెలియకపోవడం ఎలా సాధ్య మైందన్నదే ప్రశ్న. శిశువును ఎప్పుడు తీసుకొచ్చారు? తెల్ల వారుజామునా? అర్ధరాత్రి తర్వాతా? గేటు ద్వారానే వచ్చారా? మరో మార్గం ఉపయోగించారా? బిడ్డను వదిలి వెళ్లిన వ్యక్తి ఎంతసేపు అక్కడ ఉన్నారు? అన్నది తేలాల్సి ఉంది. హాస్టల్ భద్రతా వ్యవస్థ సక్రమంగా పనిచేస్తే బయట వ్యక్తి రాత్రివేళ ప్రాంగణంలోకి ప్రవేశించడం అంత సులభం కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### సిబ్బందికి తెలియకుండానేనా?

శిశువు ఏడుపు స్థానికులకు వినిపించి వారు గుర్తించారని చెబుతున్నారు. అదే నిజమైతే హాస్టల్‌లో ఉన్న సిబ్బందికి ఎందుకు వినిపించలేదు? ప్రాంగణంలో రోజువారీ పర్యవేక్షణ ఉంటే సెప్టిక్ ట్యాంకుల ప్రాంతాన్ని ఎవరూ పరిశీలించలేదా? తెల్లవారుజామున హాస్టల్ పరిసరాలను సిబ్బంది తనిఖీ చేయరా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. విద్యార్థినుల భద్రత కోసం ఏర్పాటు చేసిన సిబ్బందికి తెలియకుండా ఒక శిశువు ప్రాంగణంలో ఉండటం చిన్న విషయం కాదని స్థానికులు పేర్కొంటున్నారు.

### సమాచారం ఇచ్చిన తీరుపై చర్చ

శిశువును స్థానికులే తొలుత గుర్తించినట్లయితే, అత్యవసర పరిస్థితిగా భావించి పోలీసులకు లేదా 112కు సమాచారం ఇవ్వకుండా ముందుగా హాస్టల్ వార్డెన్‌కు ఎందుకు చెప్పార న్నదీ చర్చనీయాంశంగా మారింది. వార్డెన్‌కు సమాచారం అందిన వెంటనే పోలీసులకు తెలియజేశారా? మధ్యలో ఎంత సమయం గడిచింది? సంఘటనా స్థలానికి చేరుకునేలోపు అక్కడ ఎవరెవరు ఉన్నారు? అనే వివరాలను అధికారులు నమోదు చేయాల్సి ఉంది. ఇక్కడే మరో కీలక అంశం తెరపైకి వస్తోంది. ఘటన గురించి బయటకు సమాచారం వెళ్లకుండా ముందుగా హాస్టల్ పరిధిలోనే వ్యవహారాన్ని చక్కదిద్దే ప్రయత్నం జరిగిందా? అన్న అనుమానాలను కొందరు స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఎలాంటి నిర్ధారణ లేకపోయినా.. పోలీసుల దర్యాప్తులో వాస్తవం తేలాల్సి ఉంది.

### 'ఆమెకు తెలుసా?'.. ప్రచారంపై ఆరా

ఈ ఘటనకు హాస్టల్‌లోని ఓ విద్యార్థినిపై పలువురు అను మానం వ్యక్తం చేస్తున్నారంటూ స్థానికంగా జోరుగా ప్రచారం జరుగుతోంది. అయితే దీనికి అధికారిక ధ్రువీకరణ లేదు. ఆధారాలు లేకుండా ఆ విద్యార్థినిపై ఆరోపణలు చేయడం తగ దు. అయితే ఇలాంటి అనుమానం ఎందుకు వ్యక్తమవు తోం ది? దానికి కారణం ఏమిటి అన్నదే ప్రశ్న. హాస్టల్‌లోని ఓ విద్యార్థినిపై స్థానికుల్లో వ్యక్తమవుతున్న అనుమానాలే కోణా లను కూడా నివృతి చేసేలా దర్యాప్తు అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

### వార్డెన్ విధులపై సమీక్ష అవసరం

వార్డెన్ హాస్టల్‌లో ఏ సమయాల్లో అందుబాటులో ఉంటారు? రాత్రి పర్యవేక్షణ ఎవరి బాధ్యత? ఆమెకు సహాయకులుగా ఎంతమంది సిబ్బంది ఉన్నారు? రాత్రి డ్యూటీకి ఎవరు హాజర య్యారు? గేటు పర్యవేక్షణ ఎవరు చేశారు? వంటి వివరాలను అధికారులు పరిశీలించాల్సి ఉంది. డ్యూటీ రిజిస్టర్‌లో ఒకటి.. వాస్తవ పరిస్థితి మరొకటిగా ఉంటే అది మరింత తీవ్రమైన అంశం అవుతుంది. అందువల్ల ఘటన జరిగిన రోజు సిబ్బంది హాజరు పట్టికను స్వాధీనం చేసుకుని పరిశీలించాల్సిన అవ సరం ఉంది.

### సెక్యూరిటీ సిబ్బంది ఏం చేస్తున్నారు?

హాస్టల్‌లోని భద్రతా సిబ్బంది పాత్రపైనా ప్రశ్నలు తలెత్తుతు న్నాయి. రాత్రివేళ గేటు వద్ద ఎవరు ఉన్నారు? గేటు మూసి ఉందా? సందర్శకుల రిజిస్టర్ నిర్వహిస్తున్నారా? ప్రాంగణం లోకి వచ్చిన వ్యక్తుల వివరాలు నమోదు చేస్తున్నారా? వెనుక భాగంలో భద్రతా పర్యవేక్షణ ఉందా? వంటి అంశాలు వెలుగు లోకి రావాలి. బాలికల వసతి గృహానికి రాత్రివేళ భద్రత ఎలా కల్పిస్తున్నారన్న ప్రశ్నకు అధికారులు సమాధానం చెప్పాలి.

### సీసీ కెమెరాలే కీలకం

వందలాది మంది విద్యార్థినీలు ఉండే హాస్టల్‌లో వారి బద్రతకు తప్పని సరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చెయ్యిలి. అలా చేసి ఉంటే ఘటనకు ముందు, తర్వాతి పుటేజీని పోలీసులు పరిశీలించాలి. ప్రధాన గేటు, వెనుక భాగం, సెప్టిక్ ట్యాంకుల పరిసరాలు, సమీప రహదారులు, క్రీడా మైదానం వైపు ప్రాంతాల్లో కెమెరాలుంటే వాటి రికార్డింగులను పరిశీలిస్తే కీలక ఆధారాలు లభించే అవకాశం ఉంది. బిడ్డను ఎవరు తీసుకొచ్చారు? వాహనంలో వచ్చారా? నడుచుకుంటూ వచ్చారా? ఏ దిశ నుంచి ప్రవేశించారు? ఎక్కడి నుంచి వెళ్లారు? వంటి ప్రశ్నలకు కెమెరా దృశ్యాలు సమాధానం చెప్పే అవకాశం ఉంది.

### ఘటన బయటపడే వరకు ఏం జరిగింది?

స్థానికులు శిశువును గుర్తించిన సమయం నుంచి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకునే వరకు జరిగిన పరిణామా లపైనా అధికారులు దృష్టి పెట్టాలి. శిశువును చూసిన మొదటి వ్యక్తి ఎవరు? ఆయన ఎవరికి చెప్పారు? వార్డెన్‌కు ఎప్పుడు సమాచారం వెళ్లింది? వార్డెన్ పోలీసులకు ఎప్పుడు ఫోన్ చేశారు? పోలీసులు ఎప్పుడు చేరుకున్నారు? ఆసుపత్రికి తరలించడానికి ఎంత సమయం పట్టింది? అన్న వివరాలతో సమయ క్రమాన్ని రూపొందిస్తే అనుమానాలకు తెరపడే అవకాశం ఉంది.

### 'నిర్లక్ష్యం'పై విచారణ ఎక్కడ?

ఈ ఘటనలో శిశువును వదిలి వెళ్లిన వ్యక్తిని గుర్తించడం ఎంత ముఖ్యమో.. హాస్టల్ భద్రతా వ్యవస్థలో లోపాలున్నా యా? అన్నది తేల్చడం కూడా అంతే ముఖ్యం. ఎవరైనా దొంగచాటుగా ప్రాంగణంలోకి వచ్చి ఉంటే గేటు భద్రత విఫలమైనట్లే. సిబ్బందికి తెలిసినా పట్టించుకోకపోతే అది మరో తప్పిదం. అసలు ఎవరికీ తెలియకపోతే పర్యవేక్షణ వ్యవస్థ లోపభూయిష్టంగా ఉన్నట్లే. **ఈ మూడు కోణాల్లో దర్యాప్తు సాగాల్సి ఉంది.**

### ఉన్నతాధికారుల తనిఖీ తప్పనిసరి

బాలికల హాస్టల్‌లో ఇలాంటి ఘటన జరగడం నేపథ్యంలో సంబంధిత శాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక తనిఖీ నిర్వహిం చాలి. కేవలం శిశువును ఎవరు వదిలారన్న దానికే దర్యాప్తును పరిమితం చేయకుండా.. హాస్టల్ నిర్వహణ, భద్రత, రాత్రి పర్యవేక్షణ, సిబ్బంది విధులు, సీసీ కెమెరాల పనితీరును కూడా పరిశీలించాలి. ఇది ఒక శిశువు విషయంలో జరిగిన ఘటన మాత్రమే కాదు. రేపు హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థినుల భద్రతకు సంబంధించి ఇలాంటి లోపం మరొక రూపంలో బయటపడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన హెచ్చరి కగా చూడాలి.

### సమాధానం చెప్పాల్సిన ప్రశ్నలు

- **స్థానికులు గుర్తించే వరకు హాస్టల్ సిబ్బందికి తెలియలేదా?**
- **తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వడంలో జాప్యం జరిగిందా?**
- **హాస్టల్ గేటు వద్ద రాత్రివేళ నిఘా ఉందా?**
- **సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయా?**
- **వార్డెన్, సిబ్బంది విధుల్లో ఎవరు ఉన్నారు?**
- **శిశువును ప్రాంగణంలో వదిలిన వ్యక్తి ఎవరన్నది పోలీసులు గుర్తించారా?**
- **స్థానికంగా వినిపిస్తున్న అనుమానాల వెనుక వాస్తవాలేమిటి?**

ఈ ప్రశ్నలకు సమాధానాలు లభించే వరకు ఘటనపై అను మానాలు కొనసాగుతూనే ఉంటాయి. పసికందును సురక్షితం గా ఆసుపత్రికి తరలించడం తక్షణ బాధ్యత అయితే.. ఆ శిశు వు బాలికల హాస్టల్ ప్రాంగణంలోకి ఎలా చేరిందో తేల్చడం అధికారుల తదుపరి బాధ్యత.

# త్వరలోనే ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీలో భారత్ స్వయం సమృద్ధి

భారతదేశ ఎలక్ట్రానిక్స్ తయారీ రంగం సరికొత్త చరిత్ర దిశగా అడుగులేస్తోంది. ఇప్పటివరకు కేవలం స్మార్ట్‌ఫోన్లు, టీవీలు వంటి ఉత్పత్తుల్ని అసెంబుల్ చేయడానికి పరిమితమైన భారత్, ఇప్పుడు ఎలక్ట్రానిక్స్ విడిభాగాలు, ముడి పదార్థాల తయారీలోనూ వేగంగా స్వయం సమృద్ధి సాధిస్తోంది. తయారీ సామర్థ్యాన్ని మరింత పెంచుకుంటోంది. కీలక ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీతో దేశీయ అవసరాల్ని దాదాపు పూర్తిగా తీర్చే స్థాయికి భారత్ చేరుకుంటోందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. అనేక ఎలక్ట్రానిక్స్ విభాగాల్లో 100 శాతం ఆత్మనిర్భరత సాధించిందని లేదా పూర్తి స్వయం సమృద్ధికి అత్యంత చేరువలో ఉందని స్పష్టం చేశారు. ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్స్ మాన్యుఫ్యాక్చరింగ్ స్కీమ్ (జుజమీా) కింద 5వ విడత అనుమతుల మంజూరు కార్యక్రమంలో మంత్రి – పరిశ్రమ ప్రతినిధుల్ని ఉద్దేశించి మాట్లాడారు. దేశంలో ఎలక్ట్రానిక్స్ తయారీలో స్థానిక విలువను పెంచడం, కీలక కాంపోనెంట్ల దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం, అధునాతన తయారీ సామర్థ్యాల్ని అభివృద్ధి చేయడం ఈ జుజమీా పథకం ప్రధాన లక్ష్యాలు.

దేశ ఎలక్ట్రానిక్స్ తయారీ వ్యవస్థ గతంతో పోలిస్తే గణనీయంగా విస్తరించిందని ఈ సందర్భంగా అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. ఎన్‌క్లోజర్లు, రిలేలు, ఆప్టికల్ ట్రాన్స్‌సీవర్స్, ఆనోడ్ మెటీరియల్ రంగాల్లో భారత్ 100 శాతం స్వదేశీ



సామర్థ్యాన్ని సాధించిందని, వాటిని ఇంకా ఇతర దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి చేరుకుందని తెలిపారు. ముఖ్యంగా తయారీ రంగానికి ప్రధాన కేంద్రంగా ఉన్న చైనాకు కూడా భారత్ నుంచి పీసీబీల (ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డ్స్) ఎగుమతులు ప్రారంభం కావడం అభినందించదగిన విషయమని కొనియాడారు. అశ్విని వైష్ణవ్ వెల్లడించిన వివరాల ప్రకారం, లామినేట్లలో 80 శాతం డిమాండ్‌ను స్వదేశీ తయారీ ద్వారానే భారత్ తీర్చుకుంటోంది. ప్రస్తుత విస్తరణతో త్వరలోనే ఇందులోనూ 100 శాతం ఆత్మనిర్భరత సాధించనున్నాం. ఆప్టికల్ కనెక్టర్లకు సంబంధించి దేశీయ డిమాండ్‌లో 75 శాతం సాధించాం. గతంలో భారత్‌లో అసలు తయారు చేయలేని స్థితి నుంచి ప్రస్తుతం దేశ అవసరాల్లో 60 శాతం లిథియన్ అయాన్ సెల్స్‌ను దేశీయంగా తీర్చే స్థాయికి భారత్ చేరుకుంది. ఇతర కాంపోనెంట్ల విషయానికి వస్తే ట్రాన్స్‌డ్యూసర్లలో 55 శాతం, ఎలక్ట్రానిక్స్‌కు అవసరమైన పర్మనెంట్ మ్యాగ్నెట్లలో 40 శాతం, కెపాసిటర్లలో 20 శాతం దేశీయ సామర్థ్యం సాధించినట్లు కేంద్ర మంత్రి వివరించారు.

### 106 ప్రాజెక్టులు– 74 వేలకుపైగా ఉద్యోగాలు

విడిభాగాలు, ముడి సరకుల తర్వాత ఎలక్ట్రానిక్స్ రంగానికి అవసరమయ్యే 'క్యాపిటల్ ఎక్విప్‌మెంట్ (యంత్రాలు, తయారీ పరికరాలు)' స్వదేశంలోనే తయారు చేయడం తదుపరి లక్ష్యమని మంత్రి అశ్విని వైష్ణవ్ నొక్కిచెప్పారు. సోమవారం రోజు దేశీయ క్యాపిటల్ ఎక్విప్‌మెంట్ తయారీకి సంబంధించి 2 కంపెనీలకు ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాల పథకం జుజమీా కింద కేంద్రం తాజాగా రూ. 7877 కోట్లతో 31 కొత్త ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. దీంతో ఇప్పటివరకు ఆమోదం పొందిన ప్రాజెక్టుల సంఖ్య 106కు చేరగా, వీటి మొత్తం పెట్టుబడులు రూ. 69 వేల కోట్లు దాటాయి. వీటిల్లో 38 ప్రాజెక్టులు ఇప్పటికే ఉత్పత్తిని ప్రారంభించాయని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. మరో 16 నిర్మాణంలో ఉన్నాయని మంత్రి స్పష్టం చేశారు. ఇక దీని ద్వారా ఇప్పటివరకు 74 వేల ప్రత్యక్ష

## 2014 నుంచి నిర్వహించిన పరీక్షలన్నీ రద్దు

పరీక్షల అవకతవలపై విద్యార్థులు ఆందోళనలు చేస్తున్న నేపథ్యంలో ఝార్ఖండ్ ప్రభుత్వం సోమవారం సంచలన నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో టీడీపీఎల్ సంస్థ 2014 నుంచి నిర్వహించిన పరీక్షలు అన్నింటినీ రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. అంతేకాదు, విద్యార్థుల ప్రయోజనాల కోసం కఠినమైన చట్టం తీసుకొస్తామని సీఎం హేమంత్ సోరెన్ వెల్లడించారు. టీఎస్ఆర్ డేటా ప్రాసెసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ (టీడీపీఎల్) సంస్థ 2014 నుంచి నిర్వహించిన అన్ని పరీక్షలు, ప్రకటించిన ఫలితాలు, ఎంపిక చేసిన అభ్యర్థుల లిస్టు సహా ఆ సంస్థకు సంబంధించిన ప్రతిదానినీ రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్? ప్రకటించారు. "2014 నుంచి ఇప్పటి వరకు జరిగిన అన్ని చిన్న, పెద్ద పొరపాట్లు అన్నింటిపై సమగ్రంగా విచారణ చేస్తాం. కేంద్ర ప్రభుత్వం ఎంఎండీఆర్ చట్టానికి చేసిన సవరణలపై చర్చించడానికి త్వరలో సమావేశమవుతాం. అవసరమైతే ఈ అంశంపై చర్చించడానికి ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలను కూడా నిర్వహిస్తాం" అని ఆయన పేర్కొన్నారు. సిట్?, సీఐడీ చేసిన దర్యాప్తులో అనేక దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయని ఈ సందర్భంగా సీఎం చెప్పారు. ప్రస్తుతం ఇంకా విచారణ కొనసాగుతున్నందన, ప్రతి విషయాన్ని బహిరంగా వెల్లడించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు.

## అణు ప్రమాదంలో న్యాయమైన పరిహారం ఇవ్వకుండా ఆ చట్టం కోర్టులను నిరోధిస్తుందా?



అణు ప్రమాదం సంభవించినప్పుడు బాధితులకు సరైన, న్యాయమైన నష్టపరిహారాన్ని అందించకుండా దేశంలోని కోర్టులను శాంతి చట్టం నిరోధిస్తుందా లేదా అనే విషయాన్ని స్పష్టం చేయాలని సుప్రీం కోర్టు కేంద్రాన్ని కోరింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈమేరకు పరిమిత నోటీసులు జారీ చేసింది. అలాగే ఈ చట్టం కింద ఏర్పాటు చేసే నియంత్రణ మండలిలో సభ్యులను నియమించే ప్రక్రియలో ఎలాంటి ప్రయోజనాల సంఘర్షణ లేదనే విషయాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేయాలని ఆదేశించింది. మాజీ అధికారి ఈఏఎస్ శర్మ నేతృత్వంలోని ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలతో కూడిన పిటిషనర్ల బృందం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. శాంతి చట్టం– 2025 రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 19, 21 కింద ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తోందని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ బృందం తరఫున హాజరైన న్యాయవాదులు ప్రశాంత్ భూషణ్, నేహా రాఠీ వాదనలు వినిపిస్తూ, ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ప్లాంట్ నిర్వాహకుల ఆర్థిక బాధ్యతపై ఈ చట్టం గరిష్ట పరిమితిని విధిస్తోందని వాదించారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పందిస్తూ, ఈ చట్టంపై ప్రజల్లో చాలా ఆందోళనలు, అపోహలు ఉన్నాయని అన్నారు. నిర్వాహకుల బాధ్యతపై పార్లమెంటు పరిమితి విధించినప్పటికీ, న్యాయమైన, సరైన నష్టపరిహారం ఇవ్వకుండా అది కోర్టును నిరోధించదని ఆయన స్పష్టం చేశారు. ప్రాజెక్టు నిర్వాహకులను ప్రోత్సహించడానికి, దేశంలోకి పెట్టుబడులను ఆకర్షించడానికి మాత్రమే పార్లమెంటు ఈ బిల్లును ఆమోదించిందని ఆయన గుర్తుచేశారు. అణుశక్తి కమిషన్ ఏర్పాటు చేసిన సెర్చ్?, ఎంపిక కమిటీ సిఫార్సుల మేరకు, శాంతి చట్టంలోని సెక్షన్ 17 (4) కింద అణుశక్తి నియంత్రణ సంస్థ (ఏఈఆర్‌బీ) సభ్యుల నియామకంపై తన వైఖరిని స్పష్టం చేయాలని ధర్మాసనం కేంద్రాన్ని కోరింది.

అయితే, ఈ నిబంధనల వల్ల నిర్వాహకులు భద్రతా ప్రమాణాల విషయంలో నిర్లక్ష్యం వహించే అవకాశం ఉందని పిటిషనర్ తరఫు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ న్యాయస్థానానికి వివరించారు. దేశంలోని అణు విద్యుత్ కేంద్రాలను నడపడానికి అణుశక్తి కమిషన్ బాధ్యత వహిస్తుందని, అది నియంత్రణ సంస్థకు సభ్యులను సిఫార్సు చేయలేదని, అలా చేయడం ప్రయోజనాల సంఘర్షణ అవుతుందని భూషణ్ అన్నారు.

2010 నాటి అణు విద్యుత్ బాధ్యత పౌర బాధ్యత చట్టం స్థానంలో వచ్చిన సస్టైనబుల్ హార్నెసింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా (రానూచీ×) చట్టం, ప్రైవేట్ కంపెనీలను పౌర అణు విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయడానికి అనుమతిస్తుంది. కానీ అణు విద్యుత్ ప్లాంట్‌లో ఏదైనా దురదృష్టకర ప్రమాదం జరిగినప్పుడు రూ. 3,000 కోట్లకు మించిన బాధ్యత నుంచి వాటికి మినహాయింపు ఇస్తుంది. ఈ చట్టంలోని వివిధ నిబంధనలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌లో లేవనెత్తిన అంశాలు "ఆర్థిక విధానానికి" సంబంధించినవని అత్యున్నత న్యాయస్థానం మే 19న పేర్కొంది.

ఇదిలా ఉండగా, అణు నష్టం కోసం బీమా పాలసీ, ఆర్థిక భద్రత లేదా రెండింటిని నిర్వహించాలని అణు మంత్రిత్వ శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సస్టైనబుల్ హార్నెసింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ (శాంతి) చట్టం 2025 డ్రాఫ్ట్ నియమాలను న్యూక్లియర్ ప్లాంట్ ఆపరేటర్లు పాటించాలని సూచించింది. సంబంధిత స్టోరేజీ పూల్ నుంచి ఇంధనాన్ని తొలగించే వరకు ఆర్థిక భద్రత అమలులో ఉండాలని కూడా ముసాయిదా నిబంధనలు పేర్కొంటున్నాయి. ముసాయిదా నిబంధనల ప్రకారం, కేంద్రం ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి, అణు నష్టం కోసం ఆపరేటర్ పౌర బాధ్యత, గరిష్ట పరిమితులను సమీక్షించడానికి నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేయాలి.

## పప్పుధాన్యాల రైతులకు గుడ్‌న్యూస్ దిగుబడి 15 శాతానికి పెంచేలా శాస్త్రవేత్తల కొత్త టెక్నిక్

పప్పుధాన్యాల సాగు చేసే రైతులకు శాస్త్రవేత్తలు శుభవార్తను అందించారు. తక్కువ ఖర్చుతో పంట దిగుబడిని పెంచే కొత్త టెక్నాలజీని ఉత్తర్‌ప్రదేశ్ కాన్పూర్‌లోని ఇండియన్ ఇన్?స్టిట్యూట్? ఆఫ్? పల్సెస్ రీసెర్చ్ (ఐఐపీఆర్) శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. రైజోబియం, ఫాస్ఫరస్?ను కరిగించే బ్యాక్టీరియా మిశ్రమాన్ని రూపొందించారు. దీనిని పొలాల్లో నేరుగా విత్తనాలను శుద్ధి చేయడానికి ఉపయోగించవచ్చు. దీని వల్ల పప్పుధాన్యాల దిగుబడిని 10 నుంచి 15 శాతం వరకు పెంచవచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు. ఎరువుల కొరత, పెరుగుతున్న సాగు ఖర్చులతో రైతులు ఇబ్బందులు పడుతున్న సమయంలో ఈ పరిశోధన ప్రాధాన్యతను సంతరించుకుంది. వాతవరణంలో దాదాపు 79 శాతం నత్రజని ఉంటుంది. కానీ మొక్కలు దాన్ని నేరుగా వినియోగించుకోవలేవు. ఈ సమయంలో రైజోబియం వంటి ప్రయోజనకరమైన బ్యాక్టీరియా నత్రజనిని గ్రహించుకోవడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఇవి మొక్కల వేర్లపై కణుపులు ఏర్పరిచి వాతావరణంలోని నత్రజనిని గ్రహించేలా చేస్తాయి. ఫలితంగా మొక్కల ఎదుగుదల మెరుగుపడుతుంది. అదేవిధంగా, ఫాస్ఫరస్ సోల్యూబిలైజింగ్ బ్యాక్టీరియా (పీఎస్?బీ) నేలలో ఉంటే భాస్వరాన్ని మొక్కలు సులభంగా గ్రహించే రూపంలోకి మార్చడంలో సహాయపడుతుంది. ఈ రెండు రకాల ప్రయోజనకరమైన బ్యాక్టీరియాను కలిపి వినియోగించడం వల్ల మొక్కల పెరుగుదల మరింత మెరుగుపడుతుందని శాస్త్రవేత్తలు గుర్తించారు.

'దిగుబడి 10–15 శాతం పెరగొచ్చు'

రైబోబియం, ఫాస్ఫరస్ కరిగించే బ్యాక్టీరియా కలిసి పనిచేయడం వల్ల మొక్కల ఎదుగుదల గణనీయంగా మెరుగవుతుందని చంద్రశేఖర్ ఆజాద్ యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ టెక్నాలజీకి చెందిన శాస్త్రవేత్త డాక్టర్ అఖిలేశ్ మిశ్రా తెలిపారు.

# ధైర్యం ఉంటే అసెంబ్లీకి రండి

-మొదటిపేజీ తరువాయి

విద్యావకాశాలు కల్పించేందుకు మహిళా యూనివర్సిటీని ఏర్పాటు చేసింది మొదట ఎన్టీఆరేనని పేర్కొన్నారు. తాను ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తొలినాళ్లలోనే ఉమ్మడి రాష్ట్రంలో పాఠశాలలు లేని ప్రాంతాలపై తక్షణ చర్యలు తీసుకున్నామని, ప్రతి కిలోమీటరుకు ఒక ప్రాథమిక పాఠశాల, ప్రతి మండలానికి ఒక జూనియర్ కళాశాల, ఇంజనీరింగ్ కళాశాల, జిల్లాకు ఒక మెడికల్ కళాశాల ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యా ప్రమాణాలు పెంచితేనే అభివృద్ధి సాధ్యమవుతుందని, 2019–24 మధ్య ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టని పాలకులు విద్యారంగంపై డబ్బా కొట్టుకున్నారని విమర్శించారు. ఇప్పటి వరకు 14 డీఎస్సీలు జరిగితే, టీడీపీ, ఎన్డీయే హయాంలో 11 డీఎస్సీల ద్వారా ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టామని, ఇంతవరకు అవినీతి జరిగిందని ఒక్కరు కూడా ఫిర్యాదు చేయలేదని అన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు పెంచాలనే లక్ష్యంతో గతంలో డ్రై రేషన్ కూడా అందించామని, మధ్యాహ్న భోజన పథకాన్ని రాష్ట్రంలో నాడు టీడీపీనే ప్రవేశపెట్టిందని, ఇంటర్ విద్య వరకు ఈ పథకాన్ని విస్తరించామని చెప్పారు. మహిళలకు విద్యలో కూడా రిజర్వేషన్ కల్పించేలా నిర్ణయం తీసుకున్నామని, ఉపాధ్యాయుల బదిలీలను పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రత్యేకంగా చట్టం తీసుకొచ్చామని తెలిపారు. గత 30 ఏళ్లుగా విద్యారంగంలో వినూత్న సంస్కరణల ద్వారా మార్పులు తీసుకొచ్చామని, ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఐఐటీ, ఐఐఎం వంటి విద్యాసంస్థలతో పాటు పోటీ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. 2019–24 మధ్య 10–12 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు రావడం మానేశారని, అందుకే తల్లికి వందనం పేరిట పిల్లలందరికీ ఆర్థిక సాయం అందించేలా నిర్ణయం తీసుకుని అమలు చేశామని తెలిపారు. రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు పెంచడంతో లక్ష మందికి పైగా విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు వచ్చారని ముఖ్యమంత్రి అన్నారు. గత పాలకులు ఐదేళ్లపాటు ఒక్క టీచర్ నియామకాన్ని కూడా చేపట్టలేదని, తాము అధికారంలోకి రాగానే తొలి సంతకం చేసి మెగా డీఎస్సీ ద్వారా 15,941 ఉద్యోగాలను భర్తీ చేశామని చంద్రబాబు తెలిపారు. కేవలం 148 రోజుల్లోనే మొత్తం ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేసి నియామకాలు చేపట్టామని, టెట్, డీఎస్సీ నోటిఫికేషన్లతో పాటు హారిజాంటల్, వర్టికల్ రిజర్వేషన్ల ప్రక్రియను కట్టుదిట్టంగా నిర్వహించామని చెప్పారు. 13 సబ్జెక్టుల్లో 42 వేల ప్రశ్నలను ఎంపిక చేసి అత్యుత్తమ విధానంలో పరీక్ష నిర్వహించామని, 154 కేంద్రాల్లో సీబీటీ విధానంలో పరీక్షలు నిర్వహించి ఫలితాలను కూడా పారదర్శకంగా విడుదల చేశామని తెలిపారు. పూర్తి ప్రతిభ ఆధారంగా 15,941 మందిని ఎంపిక చేసి నియామకాలు చేపట్టామని, జోనల్, రాష్ట్రస్థాయి కమిటీలతో పాటు అప్పిలేట్ అథారిటీని ఏర్పాటు చేసి ఫిర్యాదులను పరిష్కరించామని అన్నారు. స్పోర్ట్స్ కోటా కింద కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన నిబంధనలనే అమలు చేశామని, ఉద్యోగాలు పొందిన వారంతా అత్యుత్తమ ప్రతిభ కలిగిన వ్యక్తులని, ఎంతో కష్టపడి ఉద్యోగాలు సంపాదించుకున్నారని తెలిపారు. మెగా డీఎస్సీ ద్వారా తమ కష్టానికి ఫలితం దక్కిందని ఉపాధ్యాయులు చెప్పారని, మెరిట్ కమ్ రోస్టర్ విధానంలోనే ఫలితాలు ఇచ్చామని, ఎంపిక ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లోనే ఉందని పేర్కొన్నారు. ఇంతకంటే పారదర్శకత ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు. ప్రభుత్వంలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన ఓ ఐఏఎస్ అధికారి, ఓ మాజీ మంత్రి ఇష్టానుసారం మాట్లాడుతున్నారని విమర్శించారు. నోటిఫికేషన్‌లో, నియామక ప్రక్రియలో ఒక్క డీవియేషన్ కూడా లేదని స్పష్టం చేశారు. లిటిగెంట్ పార్టీకి చెందిన వ్యక్తులు వందల కేసులు వేసి అడ్డంకులు సృష్టించారని, అధికారికంగా వివరణ ఇచ్చినా రోజుకో కుట్ర చేస్తూనే ఉన్నారని ఆరోపించారు. డీఎస్సీపై గొడ్డలిపార్టీ ఒడిశా కూలీలతో, 90 ఏళ్ల జెన్‌జీ వ్యక్తులతో జగన్ ధర్నాలు చేయించిందని విమర్శించారు. ఈ ఆరోపణలను ఇక సహించలేక ఇప్పుడు టీచర్లే రోడ్డుపైకి వచ్చారని, మొన్న కర్నూలులో, నిన్న విజయవాడలో పెద్ద ఎత్తున టీచర్లు ఆందోళన చేశారని చెప్పారు. పిల్లలకు పాఠాలు చెబుతామని, తమ ప్రతిభను కించపరిస్తే గుణపాఠం కూడా చెబుతామని వారు నినదించారని ముఖ్యమంత్రి అన్నారు. తమ ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీ అని, కుట్రలు చేసే పార్టీలు, వ్యక్తులకు కాదని చంద్రబాబు స్పష్టం చేశారు. ధైర్యం ఉంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని వైసీపీకి సవాల్ విసిరారు. అసెంబ్లీకి వస్తే అడ్డంగా దొరికిపోతామనే భయంతోనే వారు రావడం లేదని, రోడ్డుపై హిట్ అండ్ రన్ తరహాలో వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఎలాంటి కుట్రలు పనిచేయవని, డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు సాధించిన వారికి పూర్తి పారదర్శకతతో, బాధ్యతతో, జవాబుదారీతనంతో నియామకాలు జరిగాయని తెలిపారు. విద్యావిధానంలో సంస్కరణలతో పాటు పరీక్షల్లోనూ మరింత పారదర్శకత తీసుకొస్తామని చెప్పారు. సిగ్గులేని ఆ పార్టీ అసెంబ్లీకి రాకుండా బయట పబ్జీలు ఆడుకుంటోందని విమర్శించారు. బాధ్యత కలిగిన వ్యక్తులు శాసనసభకు వచ్చి తమ డిమాండ్లను వినిపించాలని అన్నారు. రెండున్నరేళ్ల నుంచి అసెంబ్లీకి రాని పార్టీని చూడటం తన జీవితంలో ఇదే తొలిసారని పేర్కొన్నారు. అసెంబ్లీకి రాకుండానే జీతాలు, ప్రివిలేజెస్ తీసుకుంటున్నారని, తనకు ప్రజలపై పూర్తి బాధ్యత ఉందని, వారికి ఏముందో ప్రజలే చెప్పాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

## అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట

రాష్ట్రంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ తర్వాత పట్టణాభివృద్ధి సంస్థల పరిధులపై నెలకొన్న గందరగోళానికి ప్రభుత్వం చెక్ పెట్టింది. కొత్త జిల్లాల సరిహద్దులకు అనుగుణంగా యూడీఏల పరిధులను హేతుబద్ధీకరిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్ ఇవాళ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా యంత్రాంగంతో యూడీఏ అధికారులకు మెరుగైన సమన్వయం సాధించడం, పరిధిపై స్పష్టత తీసుకురావడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా మార్కాపురం, భీమవరం, నంద్యాల కేంద్రాలుగా మూడు నూతన పట్టణాభివృద్ధి సంస్థలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మొత్తం 11 యూడీఏల పరిధుల్లో సర్కార్ మార్పులు చేసింది. తిరుపతి, విశాఖ మెట్రో రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్డీఏ), పుట్టపర్తి, నెల్లూరు, ఒంగోలు, ఏలూరు, కర్నూలు, కాకినాడ, మచిలీపట్నం, కడప, బాపట్ల పట్టణాభివృద్ధి సంస్థల పరిధులను కొత్త జిల్లాలకు అనుగుణంగా సవరించారు. ఇక పరిపాలనా సౌలభ్యం కోసం మరో మూడు యూడీఏల పేర్లను ప్రభుత్వం మార్చింది. చిత్తూరు పట్టణాభివృద్ధి సంస్థ పేరును చిత్తూరు, పలమనేరు, కుప్పం పట్టణాభివృద్ధి సంస్థ (సీపీకేయూడీఏ)గా, పలమనేరు, కుప్పం, మదనపల్లె యూడీఏను (అన్నమయ్య పట్టణాభివృద్ధి సంస్థ)గా మార్పు చేశారు. అనంతపురం, హిందూపురం యూడీఏను (అనంతపురం పట్టణాభివృద్ధి సంస్థ)గా నామకరణం చేశారు. మరోవైపు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పట్టణాభివృద్ధి సంస్థ ద్వారా పట్టణాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడనున్నాయి. రవాణా వ్యవస్థను అభివృద్ధి చేయడం, రహదారులు, వంతెనలు, ఫ్లైఓవర్ల నిర్మాణం, తాగునీరు, మురుగునీటి పారుదల, పారిశుద్ధ్యం మెరుగు తదితర విషయాలపై దృష్టి సారించనుంది. అందుకు అవసరమైన ప్రత్యేక నిధులను సర్కార్? మంజూరు చేయనుంది. అంతేకాక నగర ప్రాంతాల్లో ఉద్యానవనాలు అభివృద్ధి, పచ్చదనం పెంపొందించేందుకు ప్రత్యేక దృష్టి సారించనున్నారు.

**అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట**

ఇప్పటివరకు భవన నిర్మాణాలను ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు నిర్మించుకోవడం, గట్టిగా ప్రశ్నిస్తే అపరాధ రుసుంతో సరిచేసేవారు. ఇకపై పెద్ద భవన నిర్మాణాలు, లేఔట్ అనుమతులను పట్టణాభివృద్ధి సంస్థ ద్వారా అనుమతులు పొందాల్సి ఉంటుంది. తద్వారా పారదర్శకంగా, నియమ నిబంధనల ప్రకారం అనుమతులు జారీకానున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా జరిగే అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట పడనుంది. పట్టణాభివృద్ధి సంస్థల పునర్?వ్యవస్థీకరణ ప్రక్రియపై పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ ఓ ప్రకటన విడుదల చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులతో విస్తృతంగా చర్చించిన తర్వాతే ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ప్రస్తుత జిల్లా వ్యవస్థకు అనుగుణంగా, ప్రజలకు మరింత సౌకర్యవంతంగా ఉండేలా యూడీఏల నిర్మాణాన్ని ఆచరణాత్మకంగా మార్చామని స్పష్టంచేశారు. తాజా ఉత్తర్వులతో రాష్ట్రంలో పట్టణాభివృద్ధి పనులు మరింత వేగవంతం కానున్నాయని నారాయణ పేర్కొన్నారు.

## ఇదేనా పాలన?

-మొదటిపేజీ తరువాయి



దిగజారిపోయాయో చెప్పడానికి ఇంతకంటే సాక్ష్యం ఇంకేం కావాలి? చంద్రబాబు.. అసలు రాష్ట్రాన్ని ఎక్కడికి తీసుకెళ్తున్నారు? ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసు వ్యవస్థలోనే, అక్రమాలను అడ్డుకోవాల్సిన యంత్రాంగంతోనే అక్రమాలు చేయిస్తుంటే, వాటిలోనే అవినీతి చోటుచేసుకుంటే ప్రజలు ఎవరిని నమ్మాలి? ఎవరికి ఫిర్యాదు చేయాలి? ప్రకాశం జిల్లా, అద్దంకి మండలం, శంఖవరప్పాడు వద్ద జరిగిన దాన్ని ఏదో ఒక్క ఘటనగా కొట్టిపారేయలేం. రెండేళ్లుగా వ్యవస్థలను ప్రజలకోసం కాకుండా రాజకీయ కక్షసాధింపులకు, ప్రత్యర్థుల గొంతు నొక్కడానికి, మీ రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేయడానికి, మీ ఎమ్మెల్యేలతో కలిసి కలెక్షన్లు తెచ్చిపెట్టుకోవడానికి, వాడుకున్న ఫలితమే ఈ పతనం. వ్యవస్థలను రాజకీయ ప్రయోజనాలకు, మీ కలెక్షన్లకు వాడుకుంటే చివరకు అవి ఎంతగా భ్రష్టుపడతాయో ఈ ఘటన కళ్లకు కడుతోంది. ఈనేపథ్యంలో, ఇద్దరు ఎస్సైలు ప్రయాణిస్తున్న కారు, తాగిన మత్తులో ఉన్న డ్రైవర్ ఒక ఆటోను ఢీకొట్టడం, ఆటోలో ఉన్నవాళ్లు తీవ్రంగా గాయపడ్డం, యాక్సిడెంట్ అయిన తర్వాత ఆ కారును చుట్టుముట్టడం, ఆ కారులో ఉన్న ఇద్దరు ఎస్సైలు మత్తులో ఉన్న పరిస్థితిలో ఉండడం, ఆ కార్ డిక్కీలో గంజాయి, మద్యం, పోలీస్ యూనిఫాం దొరకడం, చివరకు అక్కడున్న ప్రజలే జర్నలిస్టులుగా మారి, జరిగిన ఘటనను వీడియో తీసి వాస్తవాలను ప్రజల ముందుంచే ప్రయత్నం చేస్తే, "వీడియోలు తీయొద్దు, కేసులు పెడతాం" అని అక్కడకు చేరుకున్న మరో సీఐ, బెదిరిస్తున్నారంటే మీ పాలనలో పరిస్థితి ఏ స్థాయికి చేరిందో అర్థమవుతోంది. నిజాన్ని బయటపెట్టడమే నేరమా? ప్రశ్నించడమే తప్పా?

ఈ ఇద్దరు పోలీసు అధికారులు ప్రైవేటు పార్టీలు నిర్వహించారని, మద్యం, గంజాయి అక్కడ వాడారని, ఆ పార్టీలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారన్న సమాచారం మరింత దిగ్భ్రాంతి కలిగిస్తోంది. ఘటనా స్థలం నుంచి కారులో ఉన్న ఆ ఇద్దరు పోలీసు అధికారులను స్థానిక టీడీపీ నాయకులు తప్పించారన్న ఆరోపణలు కూడా అత్యంత తీవ్రమైనవి. నిష్పక్షపాతంగా పనిచేయాల్సిన వ్యవస్థతో అధికార పార్టీ నాయకుల కుమ్మక్కు ఎంత లోతుకు వెళ్లిందో ఈ ఘటన బయటపెడుతోంది. అలాంటప్పుడు రాష్ట్రంలో పోలీస్‌స్టేషన్లలో కేసుల నమోదు నుంచి విచారణ వరకు నిష్పక్షపాతంగా జరుగుతుందని ఎవరైనా నమ్ముతారా?

చంద్రబాబుగారూ... రోజూ గంటలకొద్దీ పైకి నీతి కబుర్లు చెబుతూ, లోపల రాజకీయ కుట్రలు, కక్షసాధింపులతో వ్యవస్థలను విషపూరితం చేస్తే ఫలితాలు ఇలాగే ఉంటాయి. రాజకీయ ప్రత్యర్థులపై కేసులు పెట్టడం, వారిని వేధించడం మీద చూపిస్తున్న శ్రద్ధలో కనీసం కొంతైనా శాంతిభద్రతలపై, పోలీసు వ్యవస్థ ప్రక్షాళనపై పెట్టండి.

ఈ ఘటనను కూడా మీకున్న మీడియా బలంతో కప్పిపుచ్చకండి. డైవర్ట్ చేయకండి. నిష్పక్షపాత విచారణ జరిపించి, తప్పుచేసినవారు ఎంతటివారైనా చర్యలు తీసుకోండి. ఘటనను నిలదీసిన ప్రజలపై మళ్లీ రెడ్‌బుక్ ప్రయోగించకుండా, వీడియోలు తీసిన వారిని వేధించకుండా నిజాయితీగా వ్యవహరించండి' అని సూచించారు.

## గిరిజన పీహెచ్‌సీని సందర్శించిన ఐటీడీఏ ప్రోగ్రాం అధికారి

**కొత్తపల్లి, :** ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి పి.వి.ఎస్. నాయుడు ఆదేశాల మేరకు ఐటీడీఏ ప్రోగ్రాం అధికారి బి. పరమేశ్వర్ కొత్తపల్లి, గోకవరం గిరిజన పీహెచ్‌సీతో పాటు యెర్రమటం చెంచు గూడెం, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి వైద్య సేవలను సమీక్షించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ పనితీరు, ఓపీ సేవలు, తల్లి?బిడ్డ ఆరోగ్యం, గర్భిణీలకు అందుతున్న సేవలు, టీకాలు, జ్వరాలు, అంటువ్యాధులు, ప్రయోగశాల పరీక్షలు, రక్తపోటు, మధుమేహం, మందుల లభ్యత తదితర అంశాలకు సంబంధించిన రికార్డులు, నివేదికలను పరిశీలించారు. చెంచు గూడేల్లో ఉచిత వైద్య శిబిరాలుకొత్తపల్లి, శివపురం, యెర్రమటం చెంచు గూడేల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. యెర్రమటం చెంచు గూడెంలో జరిగిన వైద్య శిబిరానికి 55 మంది, కొత్తపల్లి గూడెంలో 60 మంది హాజరయ్యారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, రక్తపోటు, మధుమేహం, జ్వరంతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి పూర్తి రక్త పరీక్షలు, మలేరియా, టైఫాయిడ్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కాలానుగుణ వ్యాధుల నివారణ, పరిశుభ్రత, పోషకాహారం, సకాలంలో వైద్య సేవలు పొందడంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ ద్వీపా నాగవేణి, గులాబ్జా, డాక్టర్ హకీమ్ రషీద్, డాక్టర్ సుష్మా సాయి, ప్రజారోగ్య విస్తరణ వైద్యాధికారి రాఘవేంద్ర, ల్యాబ్ టెక్నీషియన్ శివ, ఏఎన్ఎంలు నిర్మల జయమణి, శాంతమ్మ, ఆశా కార్యకర్తలు, మెయిల్ హెల్త్ అసిస్టెంట్ శ్రీరామ్ నాయక్ పాల్గొన్నారు. డాక్టర్ హకీమ్ రషీద్ మాట్లాడుతూ యెర్రమటం, జనాల గూడెం ప్రాంతాల్లోని గర్భిణీలను క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తూ అవసరమైన పరీక్షలు, చికిత్స, తదుపరి వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఐటీడీఏ ప్రోగ్రాం అధికారి శ్రీ బి. పరమేశ్వర్ వైద్య సిబ్బంది సేవలను అభినందించారు. గిరిజన పీహెచ్‌సీలో ప్రైవేట్ ఆసుపత్రులకు సమానంగా నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు. రికార్డుల నిర్వహణ, నిరంతర పర్యవేక్షణ, తదుపరి చికిత్సపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వైద్య సిబ్బందికి సూచించారు.

## 85% సబ్సిడీతో గొర్రెలకు, మేకలకు పశు భీమా

### :-పి.భాస్కర్ (పశువైద్యాధికారి)

**పాములపాడు** 2026 –27 సంవత్సరానికి సంబంధించి పాములపాడు మండలానికి 220 జీవాలకు భీమా లక్ష్యం నిర్దేశించడమైనదని పశువైద్యాధికారి డాక్టర్ పి.భాస్కర్ మీడియా సమావేశంలో తెలిపారు. పాములపాడు మండలంలోని, గొర్రెల, మేకల పెంపకం దారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పశువైద్యాధికారి డాక్టర్ పి.భాస్కర్ కోరారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి డాక్టర్ పి.భాస్కర్ మాట్లాడుతూ వివరాలకు సమీపంలోని, రైతు సేవా కేంద్రంలోని అనిమల్ హస్బెం డ్రి అసిస్టెంట్ , స్థానిక పశువైద్యాధికారిని సమర్పించాలన్నారు. పెంపకం దారులు 6 నెలలు దాటిన గొర్రెలకు, మేకలకు భీమా చేయించాలన్నారు. 1 సంవత్సరము రూ"లు 6,000/- భీమా వర్తించుట కొరకు చెల్లించవలసిన ప్రీమియం 180 రూపాయలు కాగా, ప్రభుత్వ సబ్సిడీ రూ 153 పోను లబ్దిదారుడు కేవలం 27 రూపాయలు చెల్లిస్తే సరిపోతుందనీ అన్నారు. ప్రతి గొర్రె, మేక కి తప్పని సరిగా చెవి పోగు / ట్యాగ్ వేయించాలన్నారు. ఎప్పుడైనా చెవి పోగు / ట్యాగ్ పడిపోతే వెంటనే పశువైద్య సిబ్బంది చేత కొత్త ట్యాగ్ వేయించాలనీ అన్నారు. ట్యాగ్ లేనిచో భీమా వర్తించదనీ అన్నారు. ఈ కార్యక్రమంలోసిబ్బంది తిరుమలేష్, కవిత, పాల్గొన్నారు.

## సభలోనైనా, బయటైనా.. డిబేట్‌కు నేను రెడీ

-మొదటిపేజీ తరువాయి



తేలుతాయని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన తొలి సంతకం మెగా డీఎస్సీపైనే అని లోకేశ్ గుర్తుచేశారు. ఈ నియామక ప్రక్రియను కేవలం 148 రోజుల్లో పూర్తి చేసి 16,347 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని తెలిపారు. 3.36 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, టీసీఎస్ అయాన్ వంటి సురక్షిత ప్లాట్‌ఫామ్ ద్వారా అత్యంత పారదర్శకంగా పరీక్షలు నిర్వహించామని వివరించారు. ఈ డీఎస్సీని అడ్డుకోవడానికే వైసీపీ నాయకులు 141 కేసులు వేశారని, సీఎం తొలి సంతకం అమలు కాకుండా అడ్డుకోవాలని కుట్ర పన్నారని ఆరోపించారు.

**ఆరోపణలను తిప్పికొట్టిన మంత్రి**

మెగా డీఎస్సీపై వైసీపీ చేస్తున్న ఆరోపణలను లోకేశ్ తీవ్రంగా ఖండించారు. ప్రశ్నపత్రం లీక్ అయిందన్నది అవాస్తవమని, 42 వేల ప్రశ్నలతో కూడిన క్వశ్చన్ బ్యాంక్ నుంచి ర్యాండమ్‌గా ప్రశ్నలు వస్తాయని, లీకేజీకి ఆస్కారమే లేదని స్పష్టం చేశారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగికి ప్రశ్నపత్రం రూపకల్పనలో ప్రమేయం లేదని, అతను శాఖాపరమైన అనుమతులు తీసుకోనందునే అనర్హుడయ్యాడని తెలిపారు. స్పోర్ట్స్ కోటాలో ఒకే సామాజికవర్గానికి మేలు చేశారన్న ఆరోపణలను తోసిపుచ్చారు. మొత్తం 372 మందిలో 46 మంది ఓసీ, 185 మంది బీసీ, 112 మంది ఎస్సీ, 29 మంది ఎస్టీ అభ్యర్థులు ఉన్నారని గణాంకాలతో సహా వివరించారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే 65 క్రీడాంశాలను పరిగణనలోకి తీసుకున్నామని, శాప్ ఆధ్వర్యంలో పారదర్శకంగా వెరిఫికేషన్ జరిపామని పేర్కొన్నారు.

**విద్యా వ్యవస్థ బలోపేతమే లక్ష్యం**

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేదని, ఫలితంగా 12 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేట్ స్కూళ్లకు వెళ్లిపోయారని లోకేశ్ విమర్శించారు. టీడీపీ హయాంలోనే 1.80 లక్షల టీచర్ పోస్టులు భర్తీ చేశామని గుర్తుచేశారు. యువగళం పాదయాత్రలో కర్నూలు జిల్లాలో వలస కూలీల పిల్లల దుస్థితిని చూసి, మెగా డీఎస్సీ ద్వారా ఆ జిల్లాకు అధిక సంఖ్యలో టీచర్లను కేటాయించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. అంబేద్కర్ రాజ్యాంగానికి అనుగుణంగా వర్టికల్, హారిజాంటల్ రిజర్వేషన్లను పక్కాగా అమలు చేశామని, ఈ విధానాన్ని ప్రశ్నించడం రాజ్యాంగాన్ని అవమానించడమేనని అన్నారు.

**యువతకు భరోసా**

ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా, బాధ్యతాయుతంగా డీఎస్సీ ప్రక్రియను పూర్తి చేసిందని యువతకు భరోసా ఇచ్చారు. అభ్యర్థుల సందేహాల నివృత్తికి ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసి, వేలాది ఫిర్యాదులను పరిష్కరించామన్నారు. "ఈ ఏడాది కూడా 3,000 పోస్టులతో డీఎస్సీ నిర్వహిస్తాం. ప్రతి ఏటా క్రమం తప్పకుండా టీచర్ పోస్టులను భర్తీ చేసి విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తాం. యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి" అని లోకేశ్ పిలుపునిచ్చారు. డీఎస్సీ అంటే 'డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికేట్' అని చెప్పే దౌర్భాగ్యపు పార్టీ రాష్ట్రంలో ఉందని ఆయన ఎద్దేవా చేశారు. పారదర్శక నియామకాలకు మద్దతుగా నిలిచిన ఉపాధ్యాయ సంఘాలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో మరో మూడు డీఎస్సీలు నిర్వహించి, ప్రభుత్వ పాఠశాలలను దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని మంత్రి లోకేశ్ పునరుద్ఘాటించారు.

## ఎల్‌నినోపై పోరాటానికి పంచ సూత్రాలు

ఎల్‌నినో ప్రభావం ప్రపంచవ్యాప్తంగా ఉందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. తద్వారా రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని చెప్పారు. అన్ని జిల్లాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు కానుందని తెలిపారు. కొన్ని జిల్లాల్లో జులై నెలలో 68 శాతం లోటు వర్షపాతం నమోదైందని వివరించారు. ఈ ఏడాది 35.5 శాతం లోటు వర్షపాతం ఉంటుందని చెబుతున్నారని, కొన్ని జిల్లాల్లో అయితే 42 శాతం లోటు వర్షపాతం ఉంటుందని అంచనా వేస్తున్నట్లు వెల్లడించారు. ఎల్‌నినోపై ప్రజలకు, రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ మేరకు ఎల్‌నినో ప్రభావం, పరిష్కారాలపై శాసనసభలో చంద్రబాబు మాట్లాడారు. 'నీటిపంపకాల్లో రాష్ట్రాల మధ్య విభేదాలు పెరుగుతున్నాయి. కావేరి జలాలపై తమిళనాడు–కర్ణాటక మధ్య వివాదం నెలకొంది. ఈ వివాదంపై సుప్రీంకోర్టు కూడా జోక్యం చేసుకుంది. గ్రామాలు, రాష్ట్రాలు, దేశాల మధ్య కూడా నీటి గొడవలు వస్తున్నాయి. కర్ణాటక, మహారాష్ట్రలోనూ లోటు వర్షపాతం ఉంది. పైనుంచి నీళ్లు రాకుంటే శ్రీశైలం, నాగార్జునసాగర్‌పై తీవ్ర ప్రభావం ఉంటుంది. ప్రాజెక్టులు, జలాశయాల్లో నీటినిల్వలు తగ్గిపోతున్నాయి. గోదావరి నదికి మాత్రం కాస్త నీళ్లు వస్తున్నాయి. పెన్నా బేసిన్ కూడా ప్రమాదంలో ఉందని' చంద్రబాబు పేర్కొన్నారు. "గడిచిన రెండేళ్లుగా సమర్థంగా నీటి నిర్వహణ చేపట్టాం. 552 టీఎంసీలు పొదుపు చేసుకున్నాం. ఇవే మనకు శ్రీరామరక్ష. ప్రస్తుతం ప్రధాన రిజర్వాయర్లల్లో 586 టీఎంసీలు ఉన్నాయి. ఉత్తరాంధ్ర ప్రాజెక్టులకు వచ్చే నీరు కూడా బాగా తగ్గింది. తాగునీటికి ఇబ్బంది లేకుండా ప్రణాళికలు సిద్ధం చేశాం. పోలవరం ఎడమ కాల్వ పనులు వేగంగా సాగుతున్నాయి. పోలవరం ఎడమ కాల్వ నుంచి అనకాపల్లి వరకు నీళ్లు తీసుకెళ్తాం. విశాఖలోని పరిశ్రమలు, డేటా సెంటర్లకు నీళ్లు అందిస్తాం. పరిశ్రమలకు, ఉద్యాన పంటలకు నీళ్లు ఇవ్వాల్సి ఉంది. గోదావరి డెల్టాలో తప్ప ఎక్కడ వరిపంట వేసినా ఇబ్బందులు వస్తాయి. నీళ్లు లేక పంటలు ఎండిపోయే పరిస్థితులు రావొచ్చు. కర్నూలు జిల్లాలో ఈసారి ఉల్లి సాగు తగ్గొచ్చు" 'జలధార ద్వారా నీటి సంరక్షణ చర్యలు చేపట్టాం. ఈ కార్యక్రమాన్ని ప్రధాని మోదీ కూడా ప్రశంసించారు. మరో మూడేళ్లలో రూ.35,555 కోట్లతో 36 ప్రాజెక్టులు నిర్మించేలా ప్రణాళికలు రూపొందించాం. ఇవన్నీ పూర్తయితే 19.16 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరు అందించవచ్చు. ఎల్‌నినోపై పోరాటానికి పంచ సూత్రాలు పెట్టుకున్నాం. భూగర్భజలాలు పెరిగేలా చర్యలు చేపడుతున్నాం. రైతులంతా వర్షపు నీటిని ఎక్కడికక్కడ పొదుపు చేసుకోవాలి. నేరేడు, మడ్డువలస ఫేజ్–2 ప్రాజెక్టులను త్వరలోనే పూర్తి చేస్తాం. నాగావళి, చంపావతి లింక్‌ను వచ్చే జూన్ నాటికి, తోటపల్లి బ్యారేజ్‌కు రూ.249 కోట్లు ఖర్చు చేసి జులైలోగా పూర్తి చేస్తాం. వంశధార, గోదావరి, కృష్ణా నదుల అనుసంధానం పూర్తి చేస్తాం. ఇవి పూర్తయితే రాష్ట్రంలో కరవు అనే మాటే ఉండదని' చంద్రబాబు అన్నారు. మరోవైపు పొగాకు రైతులకు వడ్డీ లేని రుణాలు ఇప్పించామని చంద్రబాబు పేర్కొన్నారు. నష్టపోయిన మామిడి, కోకో, ఉల్లి రైతులను ఆదుకున్నామని గుర్తుచేశారు. పశుగ్రాసానికి సమస్య రాకుండా ఏర్పాట్లు చేశామని, పశువుల కోసం గడ్డి బాగా పెంచేలా చర్యలు చేపట్టామన్నారు. అదేవిధంగా 15,300 గోకుల షెడ్లు నిర్మించామని, ఈ ఏడాది కూడా మరికొన్ని నిర్మిస్తామని చెప్పారు. సంక్షోభం వచ్చినప్పుడు అందరూ కలిసి పనిచేయాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. కష్టకాలంలో ఉన్నప్పుడు ప్రజలకు అవగాహన కల్పించాలని చంద్రబాబు అన్నారు. నీటిని తక్కువగా తీసుకునే పంటలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. సేంద్రియసాగు విధానంలో పంటలసాగు పెరగాలన్నారు. మెట్ట ప్రాంతాల రైతులకు మెరుగైన సాగు విధానం ప్రకృతి సేద్యమని తెలిపారు. మీ ప్రాంతాల్లో ప్రకృతి సేద్యాన్ని ప్రతి ఎమ్మెల్యే, మంత్రీ ప్రోత్సహించాలని కోరారు. అన్నదాతల నుంచి వచ్చే పంటలబీమా దరఖాస్తులు పెరిగాయని వివరించారు. పంటల బీమాలో దేశంలోనే ఐదో స్థానంలో ఉండటం మనకు గర్వకారణమని వెల్లడించారు. అయితే అన్ని రకాల పంటలకు బీమా చేయించడం కర్షకుల బాధ్యతని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

swarna sagaram_Swarna sagaram.qxd 8/17/2026 10:24 PM Page 1



# వేము ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఘనంగా "ధైర్య శక్తి" కార్యక్రమం







**స్వర్ణ సాగరం పూతలపట్టు**

ఆగస్టు 17 మహిళలు, బాలికల్లో ఆత్మవిశ్వాసం, మానసిక దృఢత్వం, శారీరక సామర్థ్యం మరియు స్వీయ రక్షణ నైపుణ్యాలను పెంపొందించేందుకు

వేము ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (అటానమస్)లో "ధైర్య శక్తి -- Shield for the Next Gen" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.వేము ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలోని Women Empowerment & Grievance Redressal Cell ఆధ్వర్యంలో, ూబతీఱ 8 ుఙ చొరవతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు, బాలికలకు ఉచిత స్వీయ రక్షణ శిక్షణ అందించడంతో పాటు, వారు ఎలాంటి పరిస్థితినైనా ధైర్యంగా ఎదుర్కొనేలా ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చిత్తూరు అడ్మినిస్ట్రేషన్ ఎస్పీ శ్రీ ఎస్.ఆర్. రాజశేఖర్ రాజు హాజరయ్యారు. పూతలపట్టు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీ ఎం. తిమ్మయ్య ప్రత్యేక అతిథిగా పాల్గొని విద్యార్థులకు విలువైన సూచనలు అందించారు. అలాగే కార్యక్రమానికి Suri 8 TV చైర్మన్ సురేష్ రావూరి, ధైర్య శక్తి ప్రోగ్రామ్ డైరెక్టర్ కీర్తి దళవాయి, యోధా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకులు ఎం.ఏ. సతీష్ యోధా తదితరులు హాజరయ్యారు.పూతలపట్టు సీఐ శ్రీ ఎం. తిమ్మయ్య మాట్లాడుతూ, శారీరక దృఢత్వంతో పాటు మానసిక దృఢత్వం, మైండ్ ఫిట్‌నెస్ కూడా ఎంతో ముఖ్యమని అన్నారు. ప్రతి ఒక్కరూ స్వీయ రక్షణ నైపుణ్యాలను నేర్చుకుని, ఎలాంటి ప్రతికూల పరిస్థితులు ఎదురైనా ధైర్యంగా ఎదుర్కొనే ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిం చుకోవా లని సూచించారు. జీవితంలో ఏదైనా సాధించాలంటే ముందుగా మనలో "నేను సాధించగలను" అనే ధైర్యం ఉండాలని పేర్కొన్నారు.ముఖ్య అతిథి చిత్తూరు అడ్మినిస్ట్రేషన్ ఎస్పీ శ్రీ ఎస్.ఆర్. రాజశేఖర్ రాజు మాట్లాడుతూ, యువత తమ సమస్యలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో స్వేచ్ఛగా పంచుకోవాలని సూచించారు. సమస్యలను చెప్పుకోకుండా మనలోనే దాచుకోవడం వల్ల ఒత్తిడి పెరిగి, చెడు స్నేహాలు మరియు తప్పుడు నిర్ణయాలకు దారితీసే అవకాశం ఉందని హెచ్చరించారు.ప్రస్తుత కాలంలో మొబైల్ ఫోన్ల వినియోగం విపరీతంగా పెరుగుతోందని, సాంకేతికతను అవసరానికి అనుగుణంగా మరియు బాధ్యతాయుతంగా ఉపయోగించుకోవాలని సూచించారు. పిల్లలు అడిగిన ప్రతిదీ కొనిచ్చినప్పుడే తల్లిదండ్రులు మంచివారని భావించకూడదని, తల్లిదండ్రులు విధించే కొన్ని పరిమితులు వారి భవిష్యత్తు కోసం, వారి మంచిని కోరుకునే ఉద్దేశంతోనే ఉంటాయని వివరించారు."సంతోషం ఎప్పుడూ అభివృద్ధికి దారి తీయాలి కానీ వినాశనానికి కాదు" అని ఆయన పేర్కొన్నారు. జీవితంలో ఏ విషయంలోనైనా అతిగా వ్యవహరించడం మంచిది కాదని, సమతుల్యతతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. సైబర్ నేరాలు లేదా ఆన్‌లైన్ సమస్యలు ఎదురైనప్పుడు సైబర్ క్రైమ్ విభాగం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని యువతకు భరోసా ఇచ్చారు.కళాశాల ప్రిన్సిపాల్ డా. నవీన్ కిలారి మాట్లాడుతూ, విద్యార్థుల సమగ్ర అభివృద్ధిలో విద్యతో పాటు మానసిక దృఢత్వం, శారీరక దృఢత్వం, స్వీయ రక్షణ మరియు వ్యక్తిత్వ వికాసం కూడా కీలకమని పేర్కొన్నారు. మహిళల భద్రత, సాధికారత మరియు సమస్యల పరిష్కారానికి కళాశాలలోని Women Empowerment & Grievance Redressal Cell నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.

Suri 8 TV చొరవతో చేపట్టిన "Dhairya Shakti -- Shield for the Next Genµµ కార్యక్రమం ద్వారా మహిళలు, బాలికలకు ఉచిత స్వీయ రక్షణ శిక్షణ అందించడం అభినందనీయమని కళాశాల యాజమాన్యం పేర్కొంది. మహిళలు ఆత్మవిశ్వాసంతో, ధైర్యంగా ముందుకు సాగితే "Empowered Women -- Stronger Society -- Safer Tomorrow" అనే లక్ష్యాన్ని సాధించవచ్చని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, ఔశీఎవఅ జుఎజూశీషవతీఎవత్ ౘ +తీఱవఙుఅషవ =వసతీవంయిశ్రీ జవశ్రీశ్రీ సభ్యులు, అధ్యాపకులు, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు. స్వీయ రక్షణ శిక్షణ, మానసిక దృఢత్వం, మహిళా సాధికారత, సైబర్ భద్రత మరియు వ్యక్తిగత భద్రతపై కార్యక్రమం ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు.

"ధైర్యంగా నిలుద్దాం -- మనల్ని మనం రక్షించుకుందాం -- సురక్షిత సమాజాన్ని నిర్మిద్దాం" అనే సందేశంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

తిరుపతి
చిత్తూరు నెల్లూరు అనంతపురం
విలేకరులు కావలెను
సంప్రదించండి : 9440352036

# తెలంగాణ ఉద్యమకారుల కేసుల వివరాలు ఇవ్వాలని డిఎస్పీకి వినతి పత్రం



**స్వర్ణసాగరం సూర్యాపేట జిల్లా ఆగస్టు / 17**

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో భాగస్వాములై కేసులు ఎదుర్కొన్న వారి వివరాలను అందించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు గుండెపంగు రమేష్ కోరారు.ఈ మేరకు శుక్రవారం కోదాడ స్థానిక డిఎస్పీ శ్రీనివాసరెడ్డికి వినతి పత్రాన్ని సమర్పించారు.తొలిదశ, మలిదశ తెలంగాణ ఉద్యమాల్లో పాల్గొని జైలు జీవితం అనుభవించిన వారిపై నమోదైన ఎఫ్ఐఆర్‌లు,బైండోవర్ కేసుల ప్రతిల కాపీలను కోదాడ డివిజన్ పరిధిలోని పోలీసు స్టేషన్ల నుంచి ఇప్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చిలుకూరు మండల అధ్యక్షుడు బెల్లంకొండ ప్రభాకర్ గౌడ్, మునగాల మండల అధ్యక్షుడు పోలంపల్లి వెంకటేశ్వర్లు గౌడ్, ఉద్యమకారులు దుగ్గిపోయిన రామకృష్ణ,బొమ్మకంటి వీరబాబు,అంబాల వెంకటి, దొడ్డ శ్రీను, మేకపోతుల శ్రీను,మండవ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# నగరపాలక కార్యాలయంలో వినతుల స్వీకరణ



**స్వర్ణ సాగరం చిత్తూరు ఆగస్టు 17**

నగరపాలక కార్యాలయంలో సోమవారం "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా కమిషనర్ నరసింహ ప్రసాద్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో చర్చించారు. వినతులపై క్షేత్రస్థాయి విచారణ చేసి సత్వరం పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం నాటి కార్యక్రమంలో ఇంజనీరింగ్ –3, టిడ్కో –3 చొప్పున 6 వినతులు అందాయి. కార్యక్రమంలో సహాయ కమిషనర్ ఎ ప్రసాద్, ఎంహెచ్వో డా అనిల్ కుమార్, ఈఈ చంద్రశేఖర్ రెడ్డి, ఏసీపీ నాగేంద్ర, నగరపాలక అధికారులు పాల్గొన్నారు.

# యువశ్రీ మురళికి సాహిత్య సేవా పురస్కారం




**స్వర్ణసాగరం బుచ్చినాయుడు కండ్రిగ**

వే ఫౌండేషన్ తిరుపతి 13వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన భారతీయ సాంస్కృతిక ఉత్సవం కార్యక్రమంలో భాగంగా ఆదివారం తిరుపతి నగరంలోని మహతి కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో మండలంలోని కల్లివెట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు, సాహితీవేత్త యువశ్రీ మురళికి సాహిత్య సేవా పురస్కారం అందజేశారు.తెలుగు భాషా సాహిత్యాల అభివృద్ధికి, సాహిత్య సేవకు చేస్తున్న కృషిని గుర్తిస్తూ ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. శ్రీనాథ మహాకవి మునిమనుమలు కావూరి శ్రీనివాస్ శర్మ, వే ఫౌండేషన్ వ్యవస్థాపకులు పైడి అంకయ్య, తెలుగు అధ్యాపకులు మదన్ తదితరుల చేతుల మీదుగా యువశ్రీ మురళి ఈ పురస్కారాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా యువశ్రీ మురళిని పలువురు అభినందించారు

# గెస్ట్ టీచర్ గా పనిచేయుటకు దరఖాస్తు ఆహ్వానం

**స్వర్ణ సాగరం కె వి బి పురం:**



కే వి బి పురం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల లో తాత్కాలిక ప్రాతిపదికన గెస్ట్ టీచర్ ఇంగ్లీష్ లిటరేచర్ సబ్జెక్టు బోధించుటకు దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె. సౌజన్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునేవారు బిఎ లేదా ఎంఏ ఇంగ్లీష్ లిటరేచర్ తో పాటు బీఈడీ అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పూర్తిచేసిన దరఖాస్తును ఆదర్శ పాఠశాలలో ఇవ్వాలన్నారు. డి ఈ ఎం ఓ మరియు ఇంటర్వ్యూ ద్వారా సెలక్షన్ జరుగుతుందన్నారు.

# అంబేద్కర్ కాలనీలో పాముల బెడద

**స్వర్ణ సాగరం కె వి బి పురం:**



కేవీబీమండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆనుకొని ఉన్న అంబేద్కర్ కాలనీలో గత కొన్ని నెలలుగా వీధిలైట్లు లేకపోవడంతో విష సర్పాలు ఎక్కువైంది. చీకటి పడితే ఆరుబయట రాలేకపోతున్నామని కాలనీవాసులు భాస్కర్, భాష, మురగయ్య, ప్రభాకర్, తెలిపారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా ఎవ్వరు పట్టించుకోవడంలేదని తెలిపారు. దీంతో ప్రతిరోజు నరకాన్ని అనుభవిస్తున్నామని తెలిపారు.

# ఐఎన్టీయూసీ పట్టణ అధ్యక్షుడిగా నాగేందర్ ముదిరాజ్ నియామకం



**స్వర్ణసాగరం సూర్యాపేట జిల్లా ఆగస్టు / 17**

హుజూర్ నగర్ ఐఎన్టీయూసీ పట్టణ అధ్యక్షుడిగా మద్దం నాగేందర్ ముదిరాజ్ నియమితులయ్యారు.ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన మంత్రి కెప్టెన్ నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఐఎన్టీయూసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జి.సంజీవరెడ్డి,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న గౌడ్,జిల్లా అధ్యక్షుడు ఆలకుంట్ల బాలకృష్ణలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.పట్టణంలో ఐఎన్టీయూసీ బలోపేతానికి,కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.అలాగే కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శ్రమిస్తానని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లంకొండ గురువయ్య గౌడ్,మండల అధ్యక్షుడు మేళ్లచెరువు ముక్కంటి,నాయకులు చింతకాయల రాము,కామర్షియల్/ఫార్మల్ రైస్ మిల్లు డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు సలిగంటి జానయ్య, స్ట్రీట్ వెండర్స్ ఫ్రూట్ మార్కెట్ ఉపాధ్యక్షుడు గౌని లింగరాజు,కోశాధికారి ఎస్.కె.ఉస్మాన్,కమిటీ సభ్యులు ఎస్.కె.నాగుల్ మీరా,రబ్బాని,ఉదయ్,గోపి,భూతం శీను,రత్నం తదితరులు పాల్గొన్నారు.

# కుప్పం మార్కెట్ కమిటీ గడువు మరో ఆరు నెలలు పొడిగింపు




**స్వర్ణ సాగరం.రామకుప్పం ఆగస్టు 17.**

రాష్ట్ర ప్రభుత్వం కుప్పం వ్యవసాయ మార్కెట్ కమిటీ మొదటి పదవీ కాలాన్ని మరో ఆరు నెలల పాటు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వ్యవసాయ మరియు సహకార శాఖ 17–08–2026 తేదీన 769వ నెంబరు ఉత్తర్వులను విడుదల చేసింది. గత సంవత్సరం ఆగస్టు 15వ తేదీన ఏర్పాటు చేసిన కుప్పం మార్కెట్ కమిటీ గడువు ఈ నెల 15వ తేదీతో ముగియనుండగా, రాష్ట్ర చట్టం ప్రకారం 15–08–2026 నుండి మరో ఆరు నెలల పాటు పొడిగించారు. దీంతో కుప్పం మార్కెట్ కమిటీ అధ్యక్షుడు జి.యం రాజు మరియు పాలకవర్గ సభ్యులుతమ బాధ్యతలను కొనసాగించనున్నారు. రైతుల సంక్షేమం, మార్కెట్ యార్డు అభివృద్ధి పనులు ఎటువంటి ఆటంకం లేకుండా కొనసాగేందుకు ఈ నిర్ణయం ఉపయోగపడుతుందని నేతలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ ఉత్తర్వులను అమలు చేయాల్సిందిగా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది.

# జనసేన నాయకుడు శ్రీనివాస్ సేవలు స్ఫూర్తిదాయకం---డీఎస్పీ ఎం సుధాకర్



**నర్సాపురం** :–పేద ప్రజల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని డీఎస్పీ ఎం. సుధాకర్ కొనియాడారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని 770 మంది లేసు హస్త కళాకారులకు, చేనేత కార్మికులకు ఇటీవల ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించిన సంగతి తెలిసిందే.ఈ పరీక్షల్లో కంటి సమస్యలతో బాధపడుతున్నట్లు గుర్తించిన 552 మంది బాధితులకు సోమవారం మండలంలోని రుస్తుంబాదలోగల ఇంటర్నేషనల్ లేసు ట్రేడ్ సెంటర్ లో ఉచిత కంటి అద్దాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కొప్పరు గ్రామానికి చెందిన జనసేన సీనియర్ నాయకుడు, జైత్ర మీడియా సీఈవో పోలిశెట్టి శ్రీనివాస్ ఆర్థిక సహాయంతో ఈ 552 మందికి ఉచితంగా కళ్లజోళ్లను సమకూర్చారు.ఈ కార్యక్రమానికి డీఎస్పీ ఎం. సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డీఎస్పీ సుధాకర్, జనసేన నాయకుడు పోలిశెట్టి శ్రీనివాస్ చేతుల మీదుగా లబ్ధిదారులకు కళ్లజోళ్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూనేటి డిజిటల్ యుగంలో కంటి చూపును కాపాడుకోవడం చాలా ముఖ్యమని చెప్పారు. సమాజంలో వెనుకబడిన లేసు హస్త కళాకారులు, చేనేత కార్మికుల ఆరోగ్యంపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధ పెట్టడం అభినందనీయమన్నా రు. పవన్ కళ్యాణ్ పిలుపునకు స్పందించి, ఇంత పెద్ద ఎత్తున సొంత నిధులతో వందలాది మందికి కంటి చూపు ప్రసాదించేందుకు ముందుకు వచ్చిన పోలిశెట్టి శ్రీనివాస్ సేవలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. పేదలకు సహాయం చేయడంలో శ్రీని వాస్ లాంటి నాయకులు ముం దుండడం అందరికీ ఆదర్శమ న్నారు.కళ్లజోళ్లు అందుకున్న లబ్ధిదారులు తమకు అండగా నిలిచిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు, ఉచితంగా కళ్లజోళ్లు అందించిన ఆర్థిక దాత పోలిశెట్టి శ్రీనివాస్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐ ఎల్ టి సి కన్వీనర్ కలవ కొలను నాగ తులసి రావు,వలవల నాని,మాదంశెట్టి కోటేశ్వరరావు, దేశినీడి గంగాధర్, నిప్పులేటి తారకరామారావు, కోటిపల్లి వెంకటేశ్వర రావు, రావూరి సురేష్ కుమార్,పోలిశెట్టి నళిని బులి సత్యం, గణేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

swarna sagaram_Swarna sagaram.qxd 8/17/2026 10:24 PM Page 2



## కామిరెడ్డి పరామర్శ



పెల్లకూరు స్వర్ణసాగరం ఆగస్టు17.

మండలంలోని చావలి గ్రామానికి చెందిన వైస్సార్సీపీ కార్యకర్త ముసులూరు కృష్ణయ్య కాలికి ఫ్రాక్చర్ కావడంతో విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న పార్టీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి సోమవారం ఆయనను పరామర్శించేందుకు వెళ్లారు.కృష్ణయ్య ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యకర్తలకు ఏ సమయంలో ఏ అవసరం వచ్చినా అండగా నిలవడమే తన బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.**"పదవి కోసం కాదు...** కార్యకర్తల కోసం నడిచే నాయకత్వమే నిజమైన నాయకత్వం.కష్టకాలంలో కార్యకర్త ఇంటి తలుపు తట్టే నాయకుడే నిజమైన నాయకుడు." అని స్థానికులు ప్రశంసించారు.కార్యకర్తల పట్ల తనకున్న ఆత్మీయతను మరోసారి చాటుకున్న కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి తీరుపై స్థానికులు, కార్యకర్తలు అభినందనలు వ్యక్తం చేశారు.

## దోమిసైల్ సర్టిఫికెట్ ద్వారా గిరిజన కుటుంబాలకు ఆధార్ కార్డులు ఇప్పించండి.

ప్రగతి సంస్థ కోఆర్డినేటర్ ప్రభాకర్.



స్వర్ణ సాగరం కె వి బి పురం:

మండలంలోని ఆదివారం పంచాయతీ సంబంధించి గిరిజన కాలనీలో విద్యార్థులతో కలిపి మొత్తం 35 మందికి ఆధార్ కార్డులు లేవని, వారికందరికీ డొమిసైల్ సర్టిఫికెట్ ద్వారా ఆధార్ కార్డులు మంజూరు చేయాలని ప్రగతి సంస్థ కోఆర్డినేటర్ ప్రభాకర్ తెలిపారు. సోమవారం ఆదవరం గిరిజనులతో తహసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పీజీ ఆర్ఎస్ లో ఆర్ ఐ సుబ్రహ్మణ్యం కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంస్థ కోఆర్డినేటర్ ప్రభాకర్ మాట్లాడుతూ గిరిజనులు బ్రతుకుతెరువు కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లడం వల్ల ఆధార్ కార్డులు చేసుకోలేకపోయారని తెలిపారు. ప్రస్తుతం వీరి పిల్లలు 15 మంది ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్నప్పటికీ ఆధార్ కార్డు లేనందువల్ల వారికి తల్లికి వందనం పథకం కూడా రాలేదని తెలిపారు. తహసిల్దార్ ప్రత్యేక చొరవ తీసుకొని గిరిజనులకు ఆధార్ కార్డులు ఇప్పించాలని ఆయన తెలిపారు.

## గంగమ్మ జాతరకు గట్టి పోలీసు బందోబస్తు

రేణిగుంట స్వర్ణ సాగరం ఆగస్టు 17



రేణిగుంట గంగమ్మ జాతర సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా డీఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు. రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు సూచనల మేరకు సీఐ జయచంద్ర ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందిని జాతర పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ జయచంద్ర తెలిపారు. జాతరకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తుండటంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు. జాతర ఆలయ పరిసరాలు, భక్తుల రాకపోకలు అధికంగా ఉండే ప్రాంతాల్లో పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. భక్తుల రద్దీని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ క్రమబద్ధంగా రాకపోకలు జరిగేలా చర్యలు తీసుకున్నారు. వాహనాల రాకపోకల వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులు ప్రత్యేక నియంత్రణ చర్యలు చేపట్టారు. జాతరలో మహిళలు, చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులకు గురికాకుండా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారు. రద్దీ ప్రాంతాల్లో అనుమానాస్పద కదలికలపై నిఘా ఉంచడంతో పాటు భక్తులకు అవసరమైన సూచనలు చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా సిబ్బందిని అప్రమత్తం చేశారు. జాతర ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేందుకు భక్తులు పోలీసులకు సహకరించాలని సీఐ జయచంద్ర సూచించారు. రహదారులపై వాహనాలను ఇష్టానుసారంగా నిలపకుండా, పోలీసుల సూచనలను పాటించాలని కోరారు. జాతర సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శాంతిభద్రతలు, ట్రాఫిక్ నియంత్రణపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీనివాసులు, రైటర్ చలపతి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మేటివ్ పరీక్షలను పరిశీలించిన ఎంఈఓ

స్వర్ణ సాగరం బుచ్చినాయుడు కండ్రిగ



మండల కేంద్రంలోని స్థానిక మండల ప్రాథమిక పాఠశాల, కనమనంబేడు ప్రాథమిక పాఠశాలలో జరిగే ఫార్మేట్ అసెస్మెంట్ పరీక్షలను సోమవారం మండల విద్యా శాఖ అధికారి ముని సుబ్రహ్మణ్యం పరీక్షలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ందరూ ఫార్మేటివ్ వన్ పరీక్షలను చక్కగా ఉపయోగించుకోవాలని ఆయన తెలిపారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగే ఫార్మేటివ్ అసెస్మెంట్ మ్యాథమెటిక్స్ పరీక్షలను పరిశీలించారు. విద్యార్థులు ఈ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఫార్మటు పరీక్షలే కదా అని చులకనగా భావించి చదువుపై శ్రద్ధ తగ్గించుకోవద్దని ఆయన తెలిపారు.



# వైభవంగా ముగిసిన శ్రీ జ్వాలాముఖి అమ్మవారి మహా కుంభాభిషేకం





### అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

తోటపల్లి గూడూరుస్వర్ణ సాగరం ఆగస్టు 17

మండలం లోనివరిగొండ గ్రామంలో శ్రీ జ్వాలాముఖి అమ్మవారి దేవస్థానంలో మూడు రోజులపాటు నిర్వహించిన మహా కుంభాభిషేకాల కార్యక్రమం సోమవారంతో ముగిసి ంది. ఈ సందర్భంగా నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో ఆలయ అర్చకులు మోహన కృష్ణ శర్మ ఋగ్వేద జ్యోతిష్య పండితులు శివకుమార్ శాస్త్రి దేవస్థానం చైర్ పర్సన్ కోడూరు రాజేశ్వరి శ్రీనివాసుల రెడ్డి దంపతులు ఆలయ ఈవో తాత శ్రీనివాసరావు కూర్మయ్య పీఠం కొండలరాయలు శిష్య బృందం నిర్వాహకులు దాత దబ్బుగుంట వెంగయ్య శశికళ



మహా కుంభాభిషేక ప్రాధాన్యతను వివరించారు. దాత వెంగయ్య గ్రైనేట్ నిర్మాణంలో విశిష్ట కృషి చేశారని పేర్కొన్నారు. శివకుమార్ శాస్త్రి మాట్లాడుతూ ఈ కుంభాభి షేకంలో దంపతులను చైర్ పర్సన్ ఆధ్వర్యంలో ఎంపిక చేసి అమ్మవారికి కళలు పోసి కుంభాభిషేకం వైభవంగా నిర్వహి ంచినట్లు తెలిపారు. అత్యంత ప్రాధాన్యత వహించిన శ్రీ జ్వాలాముఖి అమ్మవారిని అందరూ దర్శించుకోవాలని కోరారు. చైర్ పర్సన్ కోడూరు రాజేశ్వరి మాట్లాడుతూ సుమారు 52 సంవత్సరాల తర్వాత కుంభాభిషేకం జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈవో తాత శ్రీనివాసరావు మాట్లాడుతూ సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సహాయ సహకారాలు ఆలయ చైర్పర్సన్ కోడూరు రాజేశ్వరి శ్రీనివాసుల రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో 18 మంది వేద పండితులవేద మంత్రాలు ఆశీర్వాదంతో కుంభాభిషేకాలు వైభవంగా ముగిశాయని తెలిపారు. అన్నదాన కార్యక్రమంలో పదివేల మందికి పైగా భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు

# రాయలచెరువు ముంపు రైతులకు న్యాయం చెయ్యండి

### పి జి ఆర్ ఎస్ లో పాతపాలెం రైతులు ఫిర్యాదు

స్వర్ణ సాగరం కె వి బి పురం:

రాయలచెరువు ముంపు రైతులకు న్యాయం చేయాలని సోమవారం మండలంలోని పాతపాలెం రైతులు (15 మంది) మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన పి జి ఆర్ ఎస్ లో ఫిర్యాదు చేశారు. 2025 నవంబర్ ఆరో తేదీ జరిగిన విపత్తు లో పాతపాలెం రైతులకు సంబంధించిన పొలాలు కొట్టుకొని పోయిన సంగతి



పాఠకులకు విధితమే. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఈనెల 13వ తేదీ ముంపు రైతులకు నష్టపరిహారం చెక్కులు పంపిణీ చేసినప్పటికీ, పాతపాలెం గ్రామానికి చెందిన 15 మంది రైతులకు సంబంధించిన పొలాలు పూర్తిగా కొట్టుకొని పోయినప్పటికీ అధికారులు గుర్తించడంలో, ప్రభుత్వ సాయం



అందించడంలో విస్మరించారని రైతులు తెలిపారు. ఈ సందర్భంగా పిజిఆర్ఎస్ లో సర్వే నంబర్లతో సహా ఆధారాలతో ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ సాయం అందకపోవడంతో అప్పులు చేసి పొలాన్ని చదును చేసుకుంటున్నామని రైతులు తెలిపారు.

## విజయవంతంగా ఇంటింట తెలుగుదేశం కార్యక్రమం

స్వర్ణ సాగరం.రామకుప్పం ఆగస్టు 17



తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపుమేరకు రామకుప్పం మండల కేంద్రం లో విజయవంతంగా ఇంటిం టికి తెలుగుదేశం కార్యక్రమా న్ని మండల తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షుడు ఆంజ నేయ రెడ్డి ఆధ్వర్యంలో రామకుప్పం పట్టణంలో "ఇంటింటా తెలుగుదేశం" కార్యక్రమం విజయవంతంగా నిర్వహి స్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరియు జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రజలకు నేతలు వివరించారు. మండలంలో సిమెంట్ రహదారుల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, తాగునీటి సమస్యల పరిష్కారం, పాఠశాలల అభివృద్ధి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల బలోపేతం, రైతులకు ఆర్థిక సహాయం వంటి కార్యక్రమాలు శరవేగంగా అమలవుతున్నాయని తెలిపారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కుప్పం నియోజకవర్గం అభివృద్ధిలో రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తోందని, రామకుప్పం మండలంలోనూ అన్ని రంగాల్లో ప్రగతి కనిపిస్తోందని ఆంజనేయ రెడ్డి అన్నారు. ప్రజల వద్ద నుండి సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జ్ రామకృష్ణ, పంచాయతీ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి, మైనార్టీ నేత సలాం సాబ్, మాజీ ఎంపీటీసీ అల్లి శ్రీను, బిఎస్ మోహన్, మంజునాథ్, సుబ్రి, బాలరాజు, బూత్ కోఆర్డినేటర్ చాంద్ భాషా, స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఎస్‌విసిఎన్ ఇంజినీరింగ్ కళాశాలలో డిజిటల్ విప్లవం.

ప్రవేశం పొందిన ప్రతి విద్యార్థికీ ఉచిత ల్యాప్‌టాప్, 'గరుడ హబ్' ప్రారంభం..



కోవూరు, స్వర్ణ సాగరం, ఆగష్టు 17:

సాంకేతిక విద్య రంగంలో ప్రత్యేక ముద్ర వేస్తూ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తున్న శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ (ఎస్‌విసిఎన్ – అటానమస్) సరికొత్త ల్యాండ్‌మార్క్ నిర్ణయంతో మరోసారి వార్తల్లో నిలిచింది. 'ఎస్‌విసిఎన్ డిజిటల్ ఎంపవర్‌మెంట్ ఇనిషియేటివ్'లో భాగంగా కళాశాలలో ఈ విద్యా సంవత్సరం చేరిన ప్రతి ఒక్క విద్యార్థినీ విద్యార్థికి ఉచిత ల్యాప్‌టాప్‌లు అందిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం. శ్రీనివాస కుమార్ ఘనంగా ప్రకటించారు. ప్రాంగణంలో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన 'గరుడ హబ్ )'ను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ.. ప్రముఖ అంతర్జాతీయ ఎంఎన్‌సీ కంపెనీలతో ఎస్‌విసిఎన్ ఒప్పందాలు కుదుర్చుకుంటూ, విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీస్‌పై నేరుగా పరిశ్రమ స్థాయి ఉచిత శిక్షణ అందిస్తుందని వెల్లడించారు. అధునాతన మౌలిక సదుపాయాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తూ తమ విద్యార్థులను భావి ఉద్యోగ రంగానికి పూర్తిస్థాయిలో సన్నద్ధం చేయడంలో ఎస్‌విసిఎన్ కళాశాల ఎల్లప్పుడూ ముందుంటుందని వైస్ ప్రిన్సిపాల్ డా. ఎస్. జయలక్ష్మి, వివిధ విభాగాల అధిపతులు (నూణం), డీన్లు మరియు యాజమాన్యం స్పష్టం చేసింది.

## సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అందివ్వడమే మొదటి ప్రధాన్యత





### ఎంపీడీవో అశ్విని

స్వర్ణ సాగరం.రామకుప్పం ఆగస్టు 17

అమలు చేస్తున్న అన్ని సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అందేలా చూడడమే తన మొదటి ప్రాధాన్యతగా అని తీసుకుని పనిచేస్తానని రామకుప్పం ఎంపీడీవో అశ్విని అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్ని సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎటువంటి ఆటంకం లేకుండా అందేలా చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు చేపడతామని, అన్ని గ్రామ పంచాయతీల్లో సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి బాధ్యతగా విధులు నిర్వర్తించేలా నిరంతరం పర్యవేక్షిస్తానని తెలిపారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను వెంటనే పరిష్కరించడమే తన విధిగా భావిస్తానని, ఉత్తమ కర్తవ్య నిర్వహణ ద్వారా మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని హామీ ఇచ్చారు. సోమవారం ఆమెకు రామకుప్పం మండల మాజీ టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ ఆంజనేయ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం నిర్వహించారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామకృష్ణప్ప, మాజీ ఎంపీటీసీ అల్లి శ్రీను, పంచాయతీ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి, జిల్లా మైనార్టీ నేత సలాం సబ్, బిఎస్ మోహన్, మంజునాథ్, బాలరాజు, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర సహాయ మంత్రి కి స్వాగతం పలికిన బీజేపీ పోనగంటి భాస్కర్

రేణిగుంట స్వర్ణ సాగరం ఆగస్టు 17





సోమవారం తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయాన్ని చేరిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కి బీజేపీ సీనియర్ నాయకులు పోనగంటి భాస్కర్ శాలువాతో ఘనంగా సత్కరించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు పోనగంటి భాస్కర్ తో, భాను ప్రకాష్ రెడ్డి, అజయ్ కుమార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మంగళవారం 18 ఆగస్టు 2026

స్వర్ణసాగరం



# ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో శ్రీకాళహస్తిలో ధర్నా: రైతుల ఆవేదనకు ప్రతిధ్వని







స్వర్ణ సాగరం శ్రీకాళహస్తి రూరల్

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం (ఏఐకేఎస్) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు, రైతాంగ సమస్యల పరిష్కారం కోరుతూ శ్రీకాళహస్తిలోని ఆర్డీఓ కార్యాలయం ముందు నిరసన ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా రైతుల దీర్ఘకాలిక సమస్యలను, ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని మరోసారి వెలుగులోకి తెచ్చింది.ఈ ధర్నాకు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రామానాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతాంగ సమస్యల పట్ల తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీకాళహస్తి డివిజన్ పరిధిలో అనేక రైతాంగ సమస్యలు పేరుకుపోయాయని, వాటిని పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆయన అన్నారు.

రామానాయుడు ప్రధానంగా కొన్ని కీలక డిమాండ్లను ప్రస్తావించారు:

తిరుపతి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి: తిరుపతి జిల్లాలో వర్షాభావ పరిస్థితులు, సాగునీటి కొరత తీవ్రంగా ఉన్నందున, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి, తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల అమలు: డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఆయన నొక్కి చెప్పారు. పంటల సాగుకు అయ్యే ఖర్చులకు అదనంగా 50 శాతం కలిపి గిట్టుబాటు ధరను నిర్ణయించాలని ఈ కమిషన్ సిఫార్సు చేసింది. దీనిని అమలు చేయడం ద్వారా రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.

రైతులకు పెన్షన్: 50 సంవత్సరాలు నిండిన ప్రతి రైతుకు ప్రతి నెలా రూ. 10,000 పెన్షన్ ఇవ్వాలని రామానాయుడు డిమాండ్ చేశారు. వృద్ధాప్యంలో రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఈ పెన్షన్ తోడ్పడుతుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఐ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య, రూరల్ మండల కార్యదర్శి మించల శివకుమార్, రైతు సంఘం నాయకులు మల్లయ్య, మనీ, కృష్ణయ్య, రూపేష్ కుమార్, బాబు రాజ్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ ధర్నా రైతుల ఐక్యతను, తమ హక్కుల కోసం పోరాడే సంకల్పాన్ని మరోసారి చాటి చెప్పింది. ప్రభుత్వం ఈ డిమాండ్లను పరిగణనలోకి తీసుకుని, రైతుల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. లేనిపక్షంలో తమ ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

# అమ్మపాలెం సచివాలయ పరిధిలో గ్రీన్ అంబాసిడర్ల పనితీరుపై తీవ్ర ఆరోపణలు

స్వర్ణ సాగరం శ్రీకాళహస్తి రూరల్

శ్రీకాళహస్తి మండలం, అమ్మపాలెం సచివాలయ పరిధిలో గ్రీన్ అంబాసిడర్ల పనితీరు, పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారాయని తీవ్రమైన ప్రశ్నలు తలెత్తుతు న్నాయి. ప్రజలకు మెరుగైన పారిశుధ్యాన్ని అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం నియమించిన గ్రీన్ అంబాసిడర్లు, ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి. అయితే, అమ్మపాలెం పరిధిలో ఈ వ్యవస్థ ఆశించిన స్థాయిలో పనిచేయడం లేదని స్పష్టమ వుతోంది. వివరాల్లోకి వెళితే, పుల్లారెడ్డి కండ్రిగ సమీపంలో రోడ్డు పక్కన చెత్త కుప్పలు పేరుకుపోవడం సర్వసాధారణంగా మారింది. గ్రీన్ అంబాసిడర్లు చెత్తను సేకరించి, డంపింగ్ యార్డులకు తరలించకుండా, రోడ్డు పక్కనే పారబోసి, కేవలం ఫోటోలు తీసి తమ పని పూర్తయినట్లు చూపించడం ఆందోళన కలిగి స్తోంది. ఇది ఒక ఏకైక సంఘటన కాదని, తరచుగా ఇలాంటి అవాంఛనీయ దృశ్యాలు దర్శనమిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు.గ్రీన్ అంబాసిడర్ల పనితీరును పర్యవేక్షిం చడానికి నియమించబడిన సచివాలయ అధికారులు కూడా తమ బాధ్యతలను విస్మరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. రోడ్డు పక్కన చెత్త పేరుకుపోతున్నా, దానిని తొలగించడానికి లేదా గ్రీన్ అంబాసిడర్లపై చర్యలు తీసుకోవడానికి ఎటువంటి ప్రయత్నాలు జరగడం లేదు. ఇది అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా కనిపిస్తోంది.ఈ పరిస్థితి చూస్తుంటే, అధికా రులు గ్రీన్ అంబాసి డర్లతో కుమ్మక్కయ్యారా, లేక వారికి ఈ సమస్యలు కంటికి కనపడటం లేదా అనే సందేహాలు రేకెత్తుతు న్నాయి. పైస్థాయిలో ఉన్న శ్రీకాళహస్తి మండల అధికారులు కూడా ఈ విషయంపై దృష్టి సారించక పోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ వంటి కీలక అంశాలపై ఇంతటి నిర్లక్ష్యం తగదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.పారిశుధ్య లోపం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. ముఖ్యంగా వర్షాకాలంలో ఈ చెత్త కుప్పలు దోమలకు, ఈగలకు నిలయంగా మారి అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. కాబట్టి, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, అమ్మపాలెం సచివాలయం పరిధిలో గ్రీన్ అంబాసిడర్ల పనితీరును మెరుగుపరచాలి. చెత్తను సక్రమంగా సేకరించి, డంపింగ్ యార్డులకు తరలించేలా చూడాలి. అలాగే, పర్యవేక్షక అధికారులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో, ప్రభుత్వ ఆశయం నీరుగారిపోవడమే కాకుండా, ప్రజల ఆరోగ్యం కూడా ప్రమాదంలో పడుతుంది.



# ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తం ముఖ్యమంత్రి సహాయనిధి

## చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు



చిత్తూరు.స్వర్ణసాగరం. ఆగస్టు 17

ఆపదలో ఉన్నవారికి ముఖ్యమంత్రి సహాయనిధి ఆపన్న హస్తానందిస్తోందని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు అన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చూపుతున్న చొరవ ఎనలేనిదని కొనియా డారు.సోమవారం చిత్తూరు,లక్ష్మీ నగర్ కాలనీలోని ఎంపీ కార్యాలయంలో చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ 7,04,989 విలువచేసే ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆప్తులకు అందించి వారిలో భరోసానింపారు. బాధితుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.కష్టాలలో ఉన్న వారికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో నడుస్తున్న కూటమి ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారాయన.ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పొందిన బాధిత కుటుంబాలు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావుకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు

# కారు బైక్‌ను ఢీకొట్టి పరారీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు

## - ప్రమాదం తర్వాత ఆపకుండా కారుతో పరారైన డ్రైవర్



నాయుడుపేట,స్వర్ణసాగరం:

రాత్రి వేళ రోడ్డుపై వేగంగా దూసుకొచ్చిన ఓ కారు కాలయముడిలా మారి బైక్‌ను ముందు నుంచి అతివేగంగా ఢీకొట్టింది. ఈ ఘటన నాయుడుపేట పట్టణంలోని ఆర్టీసీకి బస్టాండ్ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. బాధితులు ,స్థానికుల కథనం మేరకు... లోతివాని గుంటలో నివసిస్తున్న ఈదురు మణి , సురేష్ నిత్య అవసరాలు నిమిత్తం ఆర్టీసీ బస్టాండ్ కి వెళుతుండగా కారు డ్రైవర్ అతివేగంగా నిర్లక్ష్యంతో ఎదురుగా వచ్చి బైకును బలంగా ఢీ కొట్టినాడు.ఈ భీకర ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు రోడ్డుపై ఎగిరిపడి తీవ్ర గాయాలతో ఆసుపత్రి పాల య్యారు. అయితే, మానవత్వం మరిచిన కారు డ్రైవర్ బాధితులను ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేయకపోగా, కారును ఆపకుండా అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ప్రమాద తీవ్రతకు బైక్ దెబ్బతినగా ఇద్దరు వ్యక్తులకు తలలు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. రక్తపు మడుగులో పడివున్న వారిని చూసి చలించిపోయిన స్థానికులు వెంటనే అప్రమత్తమై పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, క్షతగాత్రులను అంబులెన్స్ లో చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రికి తరలించారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, హిట్ అండ రన్ కింద దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని పట్టుకునేందుకు ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. పరారీలో ఉన్న కారును గుర్తిస్తామని, నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు.

# వైసీపీ యువనేత ప్రసాద్ ఆకస్మిక మృతి

## నివాళులు అర్పించిన మాజీ మంత్రి కాకాణి





మనుబోలు, స్వర్ణ సాగరం:

మనుబోలు మండలం చెరుకు మూడి పంచాయతీ ముద్దుమూడి గ్రా మంలో తీవ్ర విషాదం చోటుచేసు కుంది. వైసీపీ యువనేత, కసుమూరు పెంచలయ్య తనయుడు అయిన ప్రసాద్ (ఆదివారం రాత్రి) గుండె పోటుతో ఆకస్మికంగా మృతి చెందా రు. చిన్న వయస్సు లోనే ఆయన గుండెపోటుతో మృత్యువాత పడడం తో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సమాచారం తెలు సుకున్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి సోమవారం ఉదయం ముద్దుమూడి గ్రామానికి చేరుకున్నారు. ప్రసాద్ మృతదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రసాద్ అకాల మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబానికి తమ వంతు ధైర్యం చెప్పారు. కేవలం ఆరు నెలల చిన్నారి పాప ఉండగా ప్రసాద్ కన్నుమూయడం అందరినీ కంటతడి పెట్టించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పోనక దేవసేన శివకుమార్ రెడ్డి (గూడూరు) స్వయంగా విచ్చేసి ప్రసాద్ మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ప్రసాద్ విధులు నిర్వహిస్తున్న కారు షోరూమ్ సిబ్బంది, ఆయన స్నేహితులు శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అశ్రు నయనాలతో నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు దాసరి భాస్కర్ గౌడ్, కిషోర్ నాయుడు, చాంద్ బాషా, నాగూర్ తదితరులు పాల్గొని ప్రసాద్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# వర్సిటీ ఓరియంటేషన్ కార్యక్రమంలో ఫౌండర్, చైర్మన్ మల్లారెడ్డి

## మల్లారెడ్డి డీమ్డ్ యూనివర్సిటీలో నిర్వహణ







రేణిగుంట స్వర్ణ సాగరం ఆగస్ట్ 17

రేణిగుంట మండలం ఆర్ మల్లవరం వద్ద నిర్వహించిన వర్సిటీ ఓరియంటేషన్ కార్యక్రమంలో పాల్గొన్న ఫౌండర్, చైర్మన్ మల్లారెడ్డి, విద్యా ర్థులకు దిశానిర్దేశం చేశారు. సాంకేతిక పరిజ్ఞానమే కీలకం ప్రస్తుత గ్లోబల్ పోటీ ప్రపంచంలో కేవలం డిగ్రీ పట్టాలు మాత్రమే సరిపోవని, విద్యార్థులు నిరం తరం నైపుణ్యాలను మెరుగుపరుచుకో వాలని మల్లారెడ్డి స్పష్టం చేశారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానం, ముఖ్యంగా కృత్రిమ మేధ యుగంలో విద్యార్థులు రాణించాలంటే సరికొత్త నైపుణ్యాలు తప్పనిసరి. విద్యార్థులను భావి భారత పౌరులుగానే కాకుండా, ప్రపంచ స్థాయి నిపుణులుగా తీర్చిదిద్దడమే మా వర్సిటీ ప్రధాన లక్ష్యం అని ఆయన ఉద్ఘాటించారు. ఆధునిక కోర్సులపై ప్రత్యేక దృష్టి, నేటి పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా మల్లారెడ్డి డీమ్డ్ యూనివర్సిటీలో విద్యాబోధన సాగుతోందని ఆయన వివరించారు. ముఖ్యంగా కోడింగ్, డేటా సైన్స్, సాఫ్ట్‌వేర్ రంగంలో అత్యంత డిమాండ్ ఉన్న కోడింగ్, డేటా సైన్స్ అంశాలపై విద్యార్థులకు క్షేత్రస్థాయిలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగంలో మెళకువలను నేర్పడం ద్వారా విద్యార్థులు భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనేలా సిద్ధం చేస్తున్నామన్నారు. పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా నైపుణ్యాలను పెంపొందించుకుంటే ఉద్యోగ అవకాశాలు దానంతట అవే వస్తాయని విద్యార్థులు అకాడమిక్ చదువులతో పాటు అదనపు నైపుణ్యాలను పెంచుకోవాలని మల్లారెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రతినిధులు అధ్యాపకులు, విద్యార్థులు వారి తల్లితండ్రులు పాల్గొన్నారు.

# యువతకు మత్తు పదార్థాలపై అవగాహన

ఎస్సై హరిప్రసాద్





స్వర్ణ సాగరం బుచ్చినాయుడు కండ్రిగ

మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణంలో సోమవారం రాత్రి స్థానిక ఎస్సై హరిప్రసాద్ అక్రమంగా వెళ్తున్న లైసెన్స్ లేని వాహనాలు తనిఖీ చేపట్టారు. రాత్రి సమయంలో అధిక మోతాదులో వాహనదారులు అనుమతి లేని వాహనాల ద్వారా వ్యాపారం సాగిస్తూ ఉండడంతో సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై తమ సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేపట్టారు. అనంతరం సమీపంలోని కొంతమంది యువతకు పదార్థాల వాడకం పై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలు వాడడంతో యువత తన జీవితాలను కోల్పోతున్నట్లు తెలిపారు. మత్తు పదార్థాలు వల్ల కలిగే నష్టాలను యువతకు తెలియజేశారు.

# ప్రజాసేవే ఊపిరిగా 'టైగర్' అట్లూరి హరిబాబు జన్మదిన వేడుకలు



స్వర్ణసాగరం సూర్యాపేట జిల్లా ఆగస్టు / 17

సుదీర్ఘమైన 41 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో ఎల్లప్పుడూ ప్రజా సమస్యల పరిష్కారమే పరమావధిగా ముందుకు సాగుతున్న సీనియర్ నాయకులు,'టైగర్' అట్లూరి హరిబాబు జన్మదిన వేడుకలు సూర్యాపేట జిల్లా హుజూర్నగర్ పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో ఉన్న ఆయన నివాసంలో అత్యంత వైభవంగా, ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి.

తన సుదీర్ఘ రాజకీయ ప్రయాణంలో ఎన్నో ఎత్తుపల్లాలను,ఒడిదొడుకులను ఎదుర్కొంటూ,ప్రజా హక్కుల పరిరక్షణే ధ్యేయంగా ఆయన పోరాటాలు సాగించారు.నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తూ 'టైగర్'గా తనదైన ముద్ర వేసుకున్నారని అభిమానులు, అనుచరులు కొనియాడారు.ఈ సందర్భంగా నివాస ప్రాంగణానికి అభిమానులు మరియు స్థానిక ప్రజలు హరిబాబుకు శాలువాలు కప్పి, ఘనంగా సత్కరించారు.అభిమానుల సమక్షంలో ఆయన కేక్ కట్ చేసి శుభాకాంక్షలు స్వీకరించారు.అనంతరం అభిమానులు మాట్లాడుతూ... అట్లూరి హరిబాబు 41 ఏళ్లుగా మచ్చలేని నాయకుడిగా,ప్రజాసేవకే తన జీవితాన్ని అంకితం చేశారని ప్రశంసించారు.ఆయన నిత్యం ప్రజా సమస్యలపై స్పందిస్తూ,పేదలు మరియు నిరుపేదల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తున్న తీరు అందరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు.మరిన్ని సంవత్సరాలు ఆయన ఆయురారోగ్యాలతో, ప్రజాసేవలో ముందంజలో ఉండాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అట్లూరి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# కాలబైరవ స్వామి కి అభిషేకం

స్వర్ణసాగరం బైరెడ్డిపల్లి ఆగస్టు 17 :-



శ్రావణమాస సోమవారం సందర్భంగా మండల పరిధిలోని కుప్పనపల్లె గ్రామం వద్ద వెలసిన శ్రీ భైరవి కాల బైరవేశ్వర స్వామి దేవస్థానమునందు అర్చకులు మురళీధరాచార్యులు శుద్ధి పుణ్యాహవాచనం కలశ పూజ నిర్మాల్య పూజ చేసి స్వామివారికి పంచామృత అభిషేకములు జరిపి వివిధ రకాల సుగంధ పుష్పాలతో సుందరంగా అలంకరించి పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమమునకు చిక్కన పల్లె, పలమనేరు, కుప్పనపల్లె గ్రామస్తులు ఉబయ దారులుగా వ్యవహరించారు భక్తులకు అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ సమావేశాల ప్రత్యక్ష వీక్షణ -- ఒక విద్యార్థి అనుభవం

స్వర్ణ సాగరం శ్రీకాళహస్తి రూరల్



ప్రజాస్వామ్య వ్యవస్థకు గుండెకాయ వంటి శాసనసభ సమావేశాలను ప్రత్యక్షంగా వీక్షించడం, అది కూడా విద్యార్థి దశలో, ఒక అపురూపమైన అనుభవం. ముచ్చువోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అటువంటి అదృష్టమే లభించింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్ ఆధ్వర్యంలో, ఉపాధ్యాయులు చిరంజీవులు, నరసింహయ్య, కిషోర్ కుమార్, డాక్టర్ ఎన్. సుబ్రమణ్య శర్మ పర్యవేక్షణలో 44 మంది విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలను ప్రత్యక్షంగా వీక్షించారు. ఈ అద్భుతమైన అవకాశాన్ని కల్పించినందుకు విద్యార్థులు తమ కృతజ్ఞతలను తెలియజేశారు.పదో తరగతి విద్యార్థులుగా, ప్రజాస్వామ్యం, శాసనసభ, ప్రజాప్రతినిధులు, చట్టాల గురించి పుస్తకాలలో చదివిన విషయాలను ప్రత్యక్షంగా చూడటం ద్వారా వారు మరింత లోతుగా అర్థం చేసుకోగలిగారు. శాసనసభలో గౌరవ సభ్యులు ప్రజల సమస్యలను ప్రస్తావించడం, వివిధ అంశాలపై చర్చించడం, ప్రశ్నలు అడగడం, ప్రభుత్వం సమాధానాలు ఇవ్వడం వంటి ప్రక్రియలను వారు కళ్ళారా చూశారు. ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో ప్రజాప్రతినిధుల పాత్ర ఎంత కీలకమో ఈ అనుభవం ద్వారా వారికి స్పష్టమైంది.ఈ ప్రత్యక్ష వీక్షణ ద్వారా విద్యార్థులకు ప్రజాస్వామ్య వ్యవస్థపై మరింత అవగాహన కలిగింది. మన దేశంలో ప్రతి పౌరుడికి హక్కులతో పాటు బాధ్యతలు కూడా ఉన్నాయని వారు గ్రహించారు. భవిష్యత్తులో మంచి పౌరులుగా ఎదిగి, సమాజానికి ఉపయోగపడే విధంగా పనిచేయాలని వారు సంకల్పించుకున్నారు. ఈ పర్యటన క్రమశిక్షణ, సమయపాలన, బాధ్యత, నాయకత్వ లక్షణాలు మరియు ప్రజాసేవ పట్ల అనేక మంచి విషయాలను వారికి నేర్పింది. విద్యార్థి దశలోనే దేశ పరిపాలనా వ్యవస్థను తెలుసుకోవడం భవిష్యత్తుకు ఎంతో ఉపయోగకరమని వారు బలంగా విశ్వసించారు.ఈ పర్యటనకు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే శ్రీ బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి రవాణా సౌకర్యాలను కల్పించి విద్యార్థులకు అండగా నిలిచారు. వారికి విద్యార్థులు మరియు పాఠశాల యాజమాన్యం తమ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ అరుదైన, జీవితంలో మరచిపోలేని అవకాశాన్ని కల్పించిన ప్రతి ఒక్కరికీ విద్యార్థులు తమ కృతజ్ఞతలను తెలియజేస్తూ, జై హింద్! జై ఆంధ్రప్రదేశ్! అంటూ తమ అనుభవాన్ని ముగించారు. ఇది కేవలం ఒక పర్యటన మాత్రమే కాదు, భావి భారత పౌరులకు ప్రజాస్వామ్య స్ఫూర్తిని నింపిన ఒక విద్యా యాత్ర.

# చిత్తూరు జిల్లా కేంద్రంలో ఘనంగా APUWJ ఆవిర్భావ దినోత్సవం

## కలెక్టర్ కు వినతిపత్రం.. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్
## - పది రోజుల్లో జర్నలిస్టులపై దాడుల నివారణ కమిటీ పై నిర్ణయం
## - కలెక్టర్ సుమిత్ కుమార్ హామీ






చిత్తూరు.స్వర్ణసాగరం. ఆగస్టు 17

ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఆవిర్భావ దినోత్సవాన్ని చిత్తూరు జిల్లా కేంద్రంలో పాత్రికేయులు ఘనంగా నిర్వహించారు. యూనియన్ ఆవిర్భవించి 70 ఏళ్ళు పూర్తయిన నేపథ్యంలో ప్లాటినం జూబ్లీ ఉత్సవాలను సేవా కార్యక్రమాల మధ్య నిర్వహించారు. ఇ్రాఖఔజీ జిల్లా అధ్యక్షులు ఎం .లోకనాథన్, ప్రధాన కార్యదర్శి మురళీకృష్ణ సమక్షంలో నగరంలోని పట్టణ నిరాశ్రయుల కేంద్రంలో వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు రమేష్ బాబు కాళేశ్వర్ రెడ్డి తో పాటు ఏపీడబ్ల్యూజే కార్యనిర్వాహక కార్యదర్శి కేఎం అశోక్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు మురహరి రెడ్డి , ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ (ఇ్రాఖఔజీ )జిల్లా అధ్యక్షులు శివకుమార్, సీనియర్ పాత్రికేయులు శివప్రసాద్, మహేష్, బాల సుందరం నరేష్, షకీల్, రాజేష్, ప్రవీణ్ సాయి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ కు వినతి.. జర్నలిస్టుల సంక్షేమం హక్కుల కోసం ఉద్యమిస్తున్న ఏపీడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవం నేపథ్యంలో చిత్తూరు కలెక్టర్ సుమిత్ కుమార్ కేక్ కట్ చేసి పాత్రికేయులకు శుభాకాంక్షలు తెలియజేశారు. నిజాలను వెలికితీయడంలో పాత్రికేయులు నిర్భయంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పాత్రికేయులకు ఇంటి స్థలాలు హెల్త్ కార్డులు పెన్షన్లు ప్రమాద బీమా పాలసీలపై కలెక్టర్ ను కలిసి వినతి పత్రం అందజేయడం జరిగింది. పది రోజుల్లో జర్నలిస్టులపై దాడుల నివారణ కమిటీ గురించి నిర్ణయం తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. సీనియర్ పాత్రికేయులు కేఎన్ సుభాష్ బాబు, హరీష్,అప్పు,చంద్ర ప్రకాష్, శివ, చంద్ర తదితరులు పాల్గొన్నారు

# శ్రీ శ్రీ శ్రీ నల్ల గంగమ్మ తల్లి ఊరేగింపు: భక్తి, ఆత్మీయత, దైవానుగ్రహం

స్వర్ణ సాగరం శ్రీకాళహస్తి రూరల్



శ్రీకాళహస్తిలోని బహుదూరుపేటలో వెలసిన శ్రీ శ్రీ శ్రీ నల్ల గంగమ్మ తల్లి ఊరేగింపు మహోత్సవం భక్తి, ఆధ్యాత్మికత, ఆత్మీయతలతో నిండిన ఒక అద్భుత ఘట్టం. ఈ పవిత్రమైన వేడుక, స్థానిక ప్రజల హృదయాల్లో అమ్మవారి పట్ల ఉన్న అచంచలమైన విశ్వాసాన్ని, భక్తిని ప్రతిబింబిస్తుంది. దండి నరేంద్ర , జనసేన పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ నాయకులు, ఈ మహోత్సవంలో పాల్గొని తమ అనుభవాలను పంచుకున్నారు.శ్రీ శ్రీ శ్రీ నల్ల గంగమ్మ ఆలయ చైర్మన్ ,కంఠ రమేష్ ప్రత్యేక ఆహ్వానం మేరకు, దండి నరేంద్ర తమ తండ్రి దండి రాఘవయ్య (శ్రీకాళహస్తి దేవస్థానం బోర్డు సభ్యులు)తో కలిసి ఈ ఊరేగింపులో పాల్గొన్నారు. అమ్మవారి ఆశీస్సులు పొందడం తమకు ఎంతో అదృష్టంగా భావిస్తున్నట్లు నరేంద్ర పేర్కొన్నారు. ఈ సందర్భంగా, "అమ్మవారి కృప ప్రతి కుటుంబంపై ఎల్లప్పుడూ ఉండాలని, శ్రీకాళహస్తి ప్రాంతం సుభిక్షంగా, శాంతియుతంగా, అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని" ఆయన ప్రార్థించారు. ఈ మాటలు కేవలం వ్యక్తిగత ఆకాంక్షలు మాత్రమే కాకుండా, సామాజిక శ్రేయస్సు పట్ల ఆయనకున్న నిబద్ధతను తెలియజేస్తాయి.నల్ల గంగమ్మ తల్లి ఊరేగింపు అత్యంత భక్తిశ్రద్ధలతో, క్రమబద్ధంగా, అద్భుతంగా నిర్వహించబడింది. ఈ మహోత్సవాన్ని విజయవంతం చేసిన , కంఠ రమేష్ మరియు ఆలయ కమిటీ సభ్యులకు దండి నరేంద్ర హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు కేవలం మతపరమైన వేడుకలు మాత్రమే కాకుండా, సమాజంలో ఐక్యతను, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించే వేదికలుగా నిలుస్తాయి.

ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా లైబ్రరీ చైర్మన్ రెడ్డివారి గురవరెడ్డి , ధర్మరాజుల గుడి చైర్మన్ ఎం.ఎస్. రెడ్డి , అర్ధనారీశ్వరి ఆలయ చైర్మన్ శ్రీమతి సునీత , ముత్యాలమ్మ గుడి చైర్మన్ శ్రీమతి రేణుకాదేవి , వరదరాజుల గుడి చైర్మన్ శ్రీమతి అద్దంకి భాగ్యలక్ష్మి , పసుపులేటి నవీన్ , గోవింద్ ,యాదగిరి , వెంకటేష్ చౌదరి , ధారా పాండు శివారెడ్డి , ఆర్ముగం వంటి పలువురు నాయకులు, అధిక సంఖ్యలో భక్తులు, స్థానికులు పాల్గొన్నారు. ఈ ప్రముఖులందరి భాగస్వామ్యం ఈ కార్యక్రమానికి మరింత శోభను చేకూర్చింది.

శ్రీ శ్రీ శ్రీ నల్ల గంగమ్మ తల్లి ఊరేగింపు కేవలం ఒక మతపరమైన ఊరేగింపు మాత్రమే కాదు, అది శ్రీకాళహస్తి ప్రజల సంస్కృతి, సంప్రదాయాలకు, వారి ఆధ్యాత్మిక జీవనానికి ప్రతీక. ఇటువంటి వేడుకలు తరతరాలుగా వస్తున్న భక్తి భావనను, సామాజిక అనుబంధాలను పదిలపరుస్తాయి. అమ్మవారి ఆశీస్సులతో శ్రీకాళహస్తి ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని ఆశిద్దాం.

## బిజినెస్

### ఐస్ మేక్‌లో జపాన్ సంస్థ పెట్టుబడి

**ముంబై :** లాజిస్టిక్స్ అండ్ కమర్షియల్ రిఫ్రిజిరేషన్ సొల్యూషన్స్ సేవల సంస్థ ఐస్ మేక్ రిఫ్రిజిరేషన్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను రూ.178.88 కోట్ల ఆదాయంపై రూ.1.65 కోట్ల నష్టాన్ని నమోదు చేసుకున్నది. కిందటేడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.111.50 కోట్ల ఆదాయంతో పోలిస్తే 60 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నది. ఈ సందర్భంగా కంపెనీ సీఎండీ చంద్రకాత్ పీ పటేల్ మాట్లాడుతూ.. జపాన్‌కు చెందిన గెలీలీ హోల్డింగ్స్ రూ.180 కోట్ల పెట్టుబడి పెట్టినట్టు చెప్పారు. ఈ నిధులను భవిష్యత్తు వ్యాపార విస్తరణకు, ప్లాంట్లను ఆధునీకరించడానికి వినియోగించనున్నట్టు చెప్పారు.

### ఐదోరోజూ నష్టాల్లోనే నిఫ్టీ



**ముంబై :** దేశీయ స్టాక్ మార్కెట్ల నష్టాల పరంపర కొనసాగుతున్నది. ఐటీ, ఎఫ్ఎంసీజీ, టెలికాం రంగ షేర్లు తీవ్ర ఒత్తిడికి గురికావడంతోపాటు క్రూడాయిల్ ధరలు భగ్గుమంటుండటం, పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడం మార్కెట్లో సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. సెన్సెక్స్ 281 పాయింట్లు కోల్పోయి 77,728.16 వద్ద స్థిరపడింది. మరో సూచీ నిఫ్టీ వరుసగా ఐదోరోజూ నష్టాలనే చవిచూసింది. 78.35 పాయింట్లు కోల్పోయి 24,287.65 వద్ద స్థిరపడింది. అమెరికా-ఇరాన్ దేశాల మధ్య జరుగుతున్న చర్చలు కొలిక్కి రాకపోవడం మదుపర్లలో సెంటిమెంట్‌ను దెబ్బతీసిందని, దీంతో అమ్మకాలకు మొగ్గుచూపడంతో నష్టాల్లోకి జారుకున్నాయి. ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, సన్‌ఫార్మా, టీసీఎస్, టెక్ మహీంద్రా, ఐటీసీ షేర్లు నష్టపోయాయి.

# గిగ్ వర్కర్లకు పండుగ కిక్కు!

## 2.7 లక్షలదాకా తాత్కాలిక ఉద్యోగావకాశాలు



**ముంబై :** పండుగ సీజన్ వచ్చిందంటే చాలు..తాత్కాలిక ఉద్యోగ అవకాశాలు లక్షల్లో పుట్టుకొస్తున్నాయి. ఈ-కామర్స్, లాజిస్టిక్, క్విక్ కామర్స్, సంఘటిత రిటైల్, బీఎఫ్ఎస్ఐ రంగాల్లో తాత్కాలిక ఉద్యోగులకు ఎనలేడి డిమాండ్ ఉన్నది. ప్రస్తుత పండుగ సీజన్‌లో 2.5 లక్షల నుంచి 2.7 లక్షల వరకు గిగావర్కర్లకు డిమాండ్ ఉండనున్నట్లు సర్వేలు వెల్లడిస్తున్నాయి. గతేడాదితో పోలిస్తే ఈసారి గిగా వర్కర్లకు డిమాండ్ 15 శాతం నుంచి 20 శాతం వరకు పెరిగే అవకాశాలున్నాయని టాలెంట్ కంపెనీ అడెక్కో ఇండియా తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. గడిచిన ఏడాది పండుగ సీజన్‌లో 2.16 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభించాయి. దేశవ్యాప్తంగా 100కి పైగా కార్పొరేట్ సంస్థల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా ఈనివేదికను రూపొందించింది.

**ద్వితీయ శ్రేణి నగరాల్లో అధికం**

ఈ ఏడాది ద్వితీయ శ్రేణి నగరాల్లోనే గిగావర్కర్లకు డిమాండ్ అధికంగా ఉంటుందని సర్వే అంచనావేస్తున్నది. ప్రధానంగా లక్నో, భువనేశ్వర్, జైపూర్, కోయంబత్తూరు వంటి నగరాల్లో అధికంగా ఉంటాయని అంచనా. ఇదే సమయంలో మెట్రో నగరాలైన ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబై, బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాల్లో ఉద్యోగుల ప్రతిభ కొరత అధికంగా ఉన్నదని, గతేడాదితో పోలిస్తే 30 శాతం తగ్గనున్నదని పేర్కొంది. తాత్కాలిక ఉద్యోగుల జీతభత్యాలు మెట్రో నగరాల్లో 12-15 శాతం వరకు పెరుగనుండగా, ద్వి, తృతీయ శ్రేణి నగరాల్లో 8-10 శాతం అధికం కావచ్చునని అంచనావేస్తున్నది

రిటైల్ సేల్స్ అసోసియేట్స్, కస్టమర్ సపోర్ట్ రిప్రజెంటేటివ్స్, ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, మర్చండైజర్, తయారీ ఆపరేటర్లకు డిమాండ్ ఉంటుంది.

హిందీ, ఇంగ్లిష్, తమిళం, తెలుగు, కన్నడ, మరాఠి వారికి డిమాండ్. రిటైల్, లాజిసిక్స్, బీఎఫ్ఎస్ఐ, ఈ-కామర్స్ రంగాల్లో నియామకాలు అనుకూలత. డిజిటల్ అక్షరాస్యత, బలమైన కమ్యూనికేషన్ వంటి నైపుణ్యాలు కీలకమైన బేధాలుగా మారుతున్నాయి. గరిష్ఠ నియామకాల్లో 10-15 శాతం డిమాండ్-సరఫరా మధ్యే?

'ప్రపంచవ్యాప్తంగా సంక్లిష్టమైన వాతావరణం ఉన్నప్పటికీ ఈ ఏడాది పండుగ సీజన్‌లో నియామకాల పట్ల ఆసక్తి బలంగా ఉన్నది. రిటైల్, ఈ-కామర్స్, లాజిస్టిక్స్, ఇతర వినియోగదారుల విభాగాల్లో డిమాండ్ అధికంగా ఉన్నది. భౌగోళిక రాజకీయ పరిణామాలు, ఇంధన ధరల అస్థిరత, మారుతున్న ప్రపంచ వాణిజ్య గతిశీలత, ఎగుమతి-ఆధారిత పరిశ్రమల్లో కొనసాగుతున్న అనిశ్చితి నేపథ్యంలో యజమానులు మరింత జాగ్రత్తగా ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

# రూపాయి@99?.. ముమ్ముందు పతనం దిశగానే దేశీయ కరెన్సీ.. బీఎంఐ అంచనా

**న్యూఢిల్లీ :** డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ముమ్ముందు మరింత దిగజారవచ్చన్న అంచనాలు వినిపిస్తున్నాయి. వచ్చే రెండు ఆర్థిక సంవత్సరాల్లో దేశీయ కరెన్సీ రికార్డు స్థాయిలకు పడిపోవచ్చని తాజాగా ఫిచ్ సొల్యూషన్స్ కంపెనీ బీఎంఐ చెప్తుండటం గమనార్హం. ఈ క్రమంలోనే ఈ ఆర్థిక సంవత్సరం (2026-27) ఆఖరు (వచ్చే ఏడాది మార్చి 31)నాటికి మునుపెన్నడూ లేనివిధంగా 97 వద్దకు భారతీయ కరెన్సీ పతనం కావచ్చని బీఎంఐ అంచనా వేసింది. అంతేగాక వచ్చే ఆర్థిక సంవత్సరం (2027-28) 99కి క్షీణించే వీలున్నదని అంటుండటం ఒకింత కలవరపాటుకు గురిచేస్తున్నదిప్పుడు.

**కారణాలెన్నో..**

పెరుగుతున్న ఇంధన ధరలు, అంతర్జాతీయ ప్రతికూల పరిస్థితులు, అననుకూల సెంట్రల్ బ్యాంక్‌ల ద్రవ్య విధానాలు.. రూపాయి విలువను తీవ్రంగా ఒత్తిడికి గురిచేస్తున్నట్టు బీఎంఐ తెలిపింది. ముఖ్యంగా అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధంతో గల్ఫ్ దేశాల్లో ముడి చమురు, సహజ వాయువు ఉత్పత్తి, రవాణాకు అడ్డంకులు



ఏర్పడిన విషయం తెలిసిందే. దీంతో గ్లోబల్ మార్కెట్‌లో బ్యారెల్ క్రూడాయిల్ రేట్లు విజృంభించగా.. దాదాపు 90 శాతం దిగుమతులతోనే ఇంధన అవసరాలను తీర్చుకుంటున్న భారత్ ఇబ్బందుల్లో పడుతున్నది. కరెన్సీ మార్కెట్‌లో డాలర్లకు పెరుగుతున్న డిమాండ్.. రూపీ వాల్యూను క్రమేణా దిగజార్చుతున్నది మరి. కాగా, మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతలు మొదలైన దగ్గర్నుంచి రూపాయి మారకం విలువ సుమారు 4 శాతం నష్టపోయిందంటే.. పశ్చిమాసియా సంక్షోభం ప్రభావం భారత్‌పై ఏ స్థాయిలో ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. దాదాపు 6 నెలలుగా అమెరికా-ఇరాన్ మధ్య యుద్ధం జరుగుతుండగా.. పరిస్థితులు ఇలాగే ఉంటే డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ త్వరలోనే సెంచరీ (100) కొట్టినా ఆశ్చర్యపోనక్కర్లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతుండటం గమనార్హం. ఈ ఏడాది మే 20న తొలిసారి 96.86 వద్ద ముగిసిన రూపాయి విలువ.. అదే రోజు ట్రేడింగ్‌లో ఒకానొక దశలో 96.95 స్థాయికి దిగిన సంగతి విదితమే.

**ఒక్కరోజే 19 పైసలు క్షీణత**

ఫారెక్స్ మార్కెట్‌లో రూపాయి మారకం విలువ నష్టాల్లో ముగిసింది. సోమవారం డాలర్‌తో పోల్చితే 19 పైసలు పడిపోయి 95.61 వద్ద స్థిరపడింది. దేశీయ స్టాక్ మార్కెట్లు క్షీణించడం, అంతర్జాతీయ మార్కెట్లలో ముడి చమురు ధరలు పెరుగడం.. దెబ్బతీసినట్టు ట్రేడర్లు విశ్లేషిస్తున్నారు. పశ్చిమాసియా సంక్షోభం ఇప్పుడప్పుడే తొలగిపోయే అవకాశాలు లేకపోవడంతో క్రూడాయిల్ రేట్లు భగ్గుమంటున్నాయి. దీంతో డాలర్లకు ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. ఇది రూపీని బలహీనపర్చిందని ఫారెక్స్ మార్కెట్ నిపుణులు ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నారు.

**ఎల్ నినో దెబ్బ**

ఎల్ నినో కారణంగా వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులు వర్షపాతాన్ని గణనీయంగా తగ్గించేస్తున్నాయి. వర్షాకాలం మొదలై 2 నెలలు దాటిపోయినా పంటల సాగు పనులు ఆశించిన స్థాయిలో ముందుకు పడటం లేదు. దేశీయంగా వ్యవసాయం ప్రధానంగా వర్షాధారమేనన్నది తెలిసిందే. దీంతో ఈసారి ద్రవ్యోల్బణం పరుగులు పెట్టడం ఖాయమన్న అంచనాలే ఉన్నాయి. ఇదే జరిగితే ధరలను అదుపులో పెట్టడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) వడ్డీరేట్లను పెంచుతుందని, ఫలితంగా రుణాలు భారమై అన్ని రంగాల్లో వృద్ధి కుంటుపడుతుందని, చివరకు దేశ జీడీపీ వృద్ధి మందగమనంలోకి జారుకుంటుందని ఎక్స్‌పర్ట్స్ చెప్తున్నారు. ఇప్పుడు బీఎంఐ సైతం ఇదే ఆందోళనల్ని వ్యక్తపర్చింది. ఇది కూడా రూపాయి విలువపై ప్రభావం చూపుతుందన్నది. ఇక బలహీనపడుతున్న రూపాయి.. దేశీయ దీర్ఘకాలిక వృద్ధి అవకాశాలపై మదుపర్లలో ఆందోళనల్ని రేకెత్తిస్తున్నట్టు బీఎంఐ ఈ సందర్భంగా తమ నోట్‌లో పేర్కొన్నది.

# మూడో రోజూ మన గాలే..

# భారత్ గుప్పిట్లోకి తొలి టెస్టు

**ఫస్ట్ ఇన్నింగ్స్‌లో లంక 284 ఆలౌట్**

**సుతార్, జడేజా స్పిన్‌కు కుదేలు**



**గాలె:** శ్రీలంక గడ్డపై స్పిన్నర్లు విజృంభించడంతో తొలి టెస్టులో భారత్ పట్టు బిగించింది. తొలి ఇన్నింగ్స్‌లో 462 పరుగుల భారీ స్కోరు చేసిన టీమిండియా.. మూడో రోజు, సోమవారం ఫస్ట్ ఇన్నింగ్స్‌లో ఆతిథ్య జట్టును 79.4 ఓవర్లలో 284 రన్స్‌కే కుప్పకూల్చింది. మానవ్ సుతార్ (4/76), రవీంద్ర జడేజా (3/57) స్పిన్ మాయకు లంక కుదేలైంది. 90 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడ్డ లంకను సోనల్ దినుషా (168 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 100) కెరీర్ తొలి శతకానికి తోడు నిరోషన్ డిక్‌వెలా (115 బంతుల్లో 7 ఫోర్లతో 80) ఆరో వికెట్‌కు 146 రన్స్ జోడించి ఆ జట్టు గౌరవప్రదమైన స్కోరు చేయడంలో కీలకపాత్ర పోషించారు. కాగా తొలి ఇన్నింగ్స్‌లో భారత్‌కు 178 రన్స్ ఆధిక్యం దక్కగా నాలుగో రోజు గిల్ సేన వేగంగా ఆడి ప్రత్యర్థి ఎదుట భారీ లక్ష్యాన్ని నిర్దేశిస్తే గాలె మన చేతికి చిక్కినట్టే!

**టాపార్డర్ టపటప**

మూడో రోజు తొలి నాలుగు బంతుల్లోనే భారత ఇన్నింగ్స్‌కు తెరదించిన లంకకు ఆ ఆనందం ఎంతోసేపు దక్కలేదు. ఆఫ్‌సైడ్‌కు ఆవలగా సిరాజ్ వేసిన తొలి ఓవర్ రెండో బంతిని వెంటాడబోయిన నిషాన్ (0) ఫస్ట్ స్లిప్‌లో పడిక్కల్‌కు క్యాచ్ ఇవ్వడంతో లంక పరుగుల ఖాతా తెరవకుండానే వికెట్ కోల్పోయింది. 8వ ఓవర్లోనే తనకు బంతిని అందించిన కెప్టెన్ గిల్ నమ్మకాన్ని నిలబెడుతూ.. సుతార్ ఫస్ట్ బాల్‌కే చందిమల్ (4)ను బోల్తా కొట్టించాడు. ఆరు ఫోర్లు కొట్టి జోరు మీద కనిపించిన ఉదార (27) డ్రింక్స్ బ్రేక్ తర్వాత సుతార్ బౌలింగ్‌లో బ్యాక్‌వర్డ్ పాయింట్‌లో జైస్వాల్‌కు క్యాచ్ ఇచ్చాడు. కమిందు మెండిస్(14).. కుల్‌దీప్ బౌలింగ్‌లో బంతిని లెగ్‌సైడ్ దిశగా డ్రైవ్ చేయగా ఎక్స్‌ట్రా కవర్స్ వద్ద ఉన్న కెప్టెన్ గిల్ పక్కకు డైవ్ చేస్తూ సూపర్ క్యాచ్ పట్టడంతో అతడి కథ ముగిసింది. లంచ్‌కు రెండు ఓవర్ల ముందు జడేజా బౌలింగ్‌లో కెప్టెన్ ధనంజయ (21) ఇచ్చిన క్యాచ్‌ను స్లిప్స్‌లో రాహుల్ అందుకోవడంతో ఆతిథ్య జట్టు 90/5తో నిలిచింది.

**ఆదుకున్న దినుషా, డిక్‌వెలా**

తొలి సెషన్‌లో భారత్ సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించగా రెండో సెషన్ మాత్రం లంకదే. మూడేండ్ల తర్వాత జట్టులోకి వచ్చిన డిక్‌వెలా.. దినుషాతో కలిసి స్ఫూర్తిదాయక ఇన్నింగ్స్ ఆడాడు. ఈ ఇద్దరూ అనవసరపు షాట్ల జోలికి పోకుండా జోరుమీదున్న టీమిండియా స్పిన్నర్లను సమర్థవంతంగా నిలువరించారు. వీరిని బుట్టలో వేసుకునేందుకు భారత్ పలుమార్లు ప్రయత్నించి విఫలమైంది. రెండు రివ్యూలనూ వేస్ట్ చేసుకుంది. స్పిన్‌ను ఎదుర్కునేందుకు ఎక్కువశాతం స్వీప్ షాట్ల ద్వారా ఈ ద్వయం పరుగులు రాబట్టింది. 20 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద రాహుల్ క్యాచ్ మిస్ చేయడంతో బతికిపోయిన డిక్‌వెలా.. 67 బంతుల్లో అర్ధశతకాన్ని పూర్తిచేసుకున్నాడు. దినుషా కాస్త నెమ్మదిగా ఆడినా ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశమివ్వలేదు. రెండో సెషన్‌లో ఈ జోడీ 29 ఓవర్లు ఆడి సుమారు 4 రన్‌రేట్‌తో 116 రన్స్ జోడించడం గమనార్హం. అయితే ఫైనల్ సెషన్ మొదలయ్యాక తన మూడో ఓవర్లో ప్రసిద్ధ్.. డిక్‌వెలాను ఔట్ చేసి ఈ జోడీని విడదీసి భారత్‌కు బ్రేక్‌నిచ్చాడు. ఆరో వికెట్‌కు ఈ జోడీ 146 రన్స్ జతచేసింది.

**తోకను కట్ చేసి..**

డిక్‌వెలా నిష్క్రమించే సమయానికి 80ల్లోకి వచ్చిన దినుషా.. లోయరార్డర్ అండతో తన తొలి టెస్టు శతకాన్ని అందుకున్నా.. జడేజా, సుతార్ మరోసారి మాయ చేసి 300లోపే జట్టును నిలువరించారు. నువంత (2)ను ఔట్ చేసి జడేజా తన టెస్టు కెరీర్‌లో 350వ వికెట్‌ను ఖాతాలో వేసుకున్నాడు. ప్రభాత్ (10) సాయంతో దినుషా శతకం పూర్తైంది. కానీ తర్వాతి బంతికే అతడు జడేజా బౌలింగ్‌లో వికెట్ల ముందు దొరికిపోయాడు. లాహిరు కుమార (10)ను సుతార్ ఔట్ చేయడంతో లంక ఇన్నింగ్స్‌కు తెరపడింది. మూడో రోజు మరో 15 ఓవర్లు మిగిలున్నా వాతావరణం అనుకూలించడకపోవడంతో అంపైర్లు ఆటను నిలిపేశారు.

**సంక్షిప్త స్కోర్లు**

భారత్: తొలి ఇన్నింగ్స్ 116.4 ఓవర్లలో 462 ఆలౌట్ (పడిక్కల్ 167, జురెల్ 51, ప్రభాత్ 4/109, నువంత 3/175)

శ్రీలంక: తొలి ఇన్నింగ్స్ 79.4 ఓవర్లలో 284 ఆలౌట్ (దినుషా 100, డిక్‌వెలా 80, సుతార్ 4/76, జడేజా 3/57)4

టెస్టుల్లో 4000 పరుగులు చేసి 350 వికెట్లు తీసిన నాలుగో క్రికెటర్ జడేజా. కపిల్ దేవ్, ఇయాన్ బోథమ్, వెటోరి ముందున్నారు.

## స్పోర్ట్స్

### ఆయుష్ నం 1 గెలుపు..

### ప్రపంచ టాప్ ర్యాంకర్ షి యుచికి చెక్.. సింధు ముందంజ



**న్యూఢిల్లీ:** సొంతగడ్డపై ప్రతిష్టాత్మక బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ తొలి రోజే భారత షట్లర్లు అద్భుత ప్రదర్శన చేశారు. యువ ఆటగాడు ఆయుష్ శెట్టి ఫస్ట్ రౌండ్‌లోనే వరల్డ్ నంబర్ వన్, డిఫెండింగ్ చాంప్ షి యుచిని ఓడించి అతి పెద్ద సంచలనం సృష్టించాడు. మహిళల సింగిల్స్‌లో డబుల్ ఒలింపిక్ మెడలిస్ట్ పీవీ సింధు సునాయాస విజయంతో రెండో రౌండ్‌కు దూసుకెళ్లింది. సోమవారం జరిగిన తొలి రౌండ్‌లో కర్నాటకకు చెందిన 21 ఏండ్ల ఆయుష్ 21-14, 13-21, 21-19తో టాప్ సీడ్ చైనా డ్రాగన్ యుచిని ఓడించి తన కెరీర్‌లోనే అతి పెద్ద విజయం అందుకున్నాడు. హోరాహోరీ పోరులో ఆట ఆరంభం నుంచే భారత కుర్రాడు దూకుడు చూపెట్టాడు. తొలి గేమ్‌లో వరుస పాయింట్లు గెలిచి 11-5 ఆధిక్యంలోకి వెళ్లాడు. కోర్టులో పాదరసంలా కదిలిన అతను పర్ఫెక్ట్ స్మాష్‌లతో ప్రత్యర్థిని ఉక్కిరిబిక్కిరి చేస్తూ అవలీలగా ఈ గేమ్ నెగ్గాడు. అయితే రెండో గేమ్‌లో యుచి తన అనుభవాన్ని ఉపయోగించి ఆడాడు. సుదీర్ఘ ర్యాలీలతో పుంజుకుని మ్యాచ్‌ను నిర్ణాయక మూడో గేమ్‌కు తీసుకెళ్లాడు. ఇందులో ఆయుష్ ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా ఆడుతూ 11-5తో బ్రేక్‌కు వెళ్లాడు. అదే జోరును కొనసాగిస్తూ తన ఆధిక్యాన్ని 15-5కి పెంచుకున్నాడు. ఈ దశలో చైనా స్టార్ పోటీలోకి వచ్చే ప్రయత్నం చేశాడు. భారత ఆటగాడు అనవసర తప్పిదాలతో నాలుగు పాయింట్లు కోల్పోవడంతో యుచి 19-20తో నిలిచి మ్యాచ్‌పై ఉత్కంఠ రేపాడు. చివర్లో ఒత్తిడిని జయించిన ఆయుష్ సింపుల్ రిటర్న్‌తో మ్యాచ్ పాయింట్ నెగ్గి ముందంజ వేశాడు. డబుల్స్ తొలి రౌండ్‌లో హరిహరన్ అంసకరుణన్ -- ఎంఆర్ అర్జున్ జోడీ రెండో రౌండ్ చేరింది.

**సింధు ఈజీగా**

మహిళల సింగిల్స్‌లో ఆరో పతక వేటలో ఉన్న 9వ సీడ్ సింధు 21-7, 21-11తో ఐర్లాండ్ షట్లర్ సోఫియా నోబుల్‌ను వరుస గేమ్స్‌లో చిత్తు చేసింది. 29 నిమిషాల్లోనే ముగిసిన ఈ మ్యాచ్‌లో సింధు పూర్తి ఆధిపత్యం చెలాయించింది. పవర్‌ఫుల్ స్మాష్‌లు, డ్రాప్ షాట్లతో ప్రత్యర్థికి ఎలాంటి అవకాశం ఇవ్వలేదు. రెండో రౌండ్‌లో కెనడాకు చెందిన వెన్ యు జాంగ్‌తో తలపడనుంది. డబుల్స్ లో కామన్వెల్త్ గేమ్స్ మెడలిస్టులు పుల్లెల గాయత్రి-ట్రీసా జాలీ 21-9, 21-13తో స్పెయిన్ ద్వయం పౌలా లోపెజ్ -- లూసియా రోడ్రిగ్జ్ జంటపై విజయం సాధించారు.

Edited Printed Published & Owned by Embeti Kameswari. And Printed at VSR Publishers and Printers, #1-176, Vakadu Village and Post, Vakadu Mandal, Tirupati District, Andhra pradesh. Published at VSR Publications, 1-176, Vakadu Village and Post, Vakadu Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR Embeti Kameswari, PRGI. NO. APTEL/26/A2367